

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | ఆదివారం 15-06-2025 | సంపుటి - 24 | సంచిక - 44 రూ : 4 | పేజీలు: 8


## ప్రపంచ టాప్-20
# కుబేరుల జాబితాలో మనవాళ్లు

- తాజాగా ప్రపంచ కుబేరుల జాబితాను విడుదల చేసిన బ్లూమ్‌బర్గ్
- బ్లూమ్‌బర్గ్ ప్రపంచ కుబేరుల జాబితాలో 17, 20 స్థానాల్లో ముఖేశ్ అంబానీ, గౌతమ్ అదానీలు
- టాప్ 100లో ధనవంతుల్లో 9 మంది భారతీయ వ్యాపార దిగ్గజాలు

ప్రపంచ కుబేరుల జాబితాలో రిలయన్స్ అధినేత ముఖేష్ అంబానీ మరోసారి

తరువాయి 2లో






## ఆధార్ ఉచిత అప్‌డేట్
# గడువు మళ్ళీ పొడిగింపు

- మరో ఏడాది ఛాన్స్!
- ఆధార్ డాక్యుమెంట్లను ఉచితంగా అప్‌డేట్ చేసుకునే గడువు పెంపు
- మరో ఏడాది పాటు, అంటే 2026 జూన్ 14 వరకు అవకాశం
- భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (యూఐడీఏఐ) ఈ నిర్ణయం
- 'మై ఆధార్' పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో ఉచితంగా అప్‌లోడ్

2లో

# సవాల్ చేస్తే సౌండ్ ఆగిపోయింది నారా లోకేశ్ ఎద్దేవా

- వైసీపీ అధినేత జగన్‌పై మంత్రి నారా లోకేశ్ తీవ్ర విమర్శలు
- 'తల్లికి వందనం' నిధులపై చేసిన ఆరోపణలు 24 గంటల్లో నిరూపించాలని లోకేశ్ సవాల్
- గడువు ముగిసినా జగన్ రుజువులు చూపలేదని, క్షమాపణ చెప్పలేదని వెల్లడి
- చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరిక
- శరణమా, న్యాయ సమరమా తేల్చుకోవాలని జగన్‌కు సూచన



ఏపీ మంత్రి నారా లోకేశ్, వైసీపీ అధినేత జగన్‌పై ధ్వజమెత్తారు. జగన్ చేసిన ఆరోపణలపై సవాల్ విసిరితే స్పందన కరవైందని, ఇది ఆయన వైఖరికి నిదర్శనమని లోకేశ్ వ్యాఖ్యానించారు. "సవాల్ చేస్తే సౌండ్ ఆఫ్!" అంటూ జగన్‌ను ఉద్దేశించి వ్యంగ్యాస్త్రాలు సంధించారు. "బురద చల్లడం పారిపోయి ప్యాలెస్‌లో దాక్కోవడం జగన్ గారికి అలవాటు. తల్లికి వందనం డబ్బులు నా జేబులోకి వెళ్ళాయి అంటూ చేసిన ఆరోపణలు 24 గంటల్లో నిరూపించాలని ఛాలెంజ్ చేసాను. సమయం ముగిసింది, రుజువు చెయ్యలేదు, క్షమాపణ కోరలేదు. అందుకే మిమ్మల్ని ఫేకు జగన్ అనేది. లీగల్ యాక్షన్ ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండండి. సమయం లేదు మిత్రమా! శరణమా... న్యాయ సమరమా? తేల్చుకోండి" అంటూ జగన్ కు లోకేశ్ అల్టిమేటమ్ జారీ చేశారు. ఏపీ ప్రభుత్వం అమలు చేస్తున్న తల్లికి వందనం పథకంలో విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.13 వేలు, మిగతా రూ.2 వేలు పాఠశాలలు/కాలేజీల అభివృద్ధి నిధుల నిమిత్తం ఆయా జిల్లాల కలెక్టర్ల ఖాతాల్లో జమ చేస్తున్నారు. అయితే, ఈ రూ.2 వేలు మంత్రి నారా లోకేశ్ జేబులోకి పోతున్నాయంటూ వైసీపీ నేతలు ఆరోపించారు. ఈ నేపథ్యంలోనే నారా లోకేశ్ సవాల్ విసిరారు.



## అంతరిక్ష ప్రయోగంలో
# పెను ముప్పు తప్పించిన ఇస్రో!

- ఫాల్కన్-9 రాకెట్ ఆక్సిడైజర్ లైన్‌లో పగులు గుర్తింపు
- ఇస్రో చైర్మన్ దృఢ వైఖరితో పెను ప్రమాదం నివారణ
- యాక్సియమ్-4 మిషన్ పలుమార్లు వాయిదా, జూన్ 19న ప్రయోగం
- భారత వ్యోమగామి శుభాంశు శుక్లా సహ నలుగురు ఈ యాత్రలో
- ఇస్రో భద్రతా నిబద్ధతకు అంతర్జాతీయ ప్రశంసలు

భారత వ్యోమగామి శుభాంశు శుక్లా సహా నలుగురు అంతరిక్ష యాత్రికులను అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి (ఐఎస్ఎస్) తీసుకెళ్లనున్న స్పేస్ఎక్స్ ఫాల్కన్ 9 రాకెట్‌లో తలెత్తిన తీవ్ర సాంకేతిక లోపాన్ని భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) సమయస్ఫూర్తితో గుర్తించి, పెను ప్రమాదాన్ని నివారించింది.

తరువాయి 2లో

## రేవంత్ రెడ్డి చేతుల మీదుగా
# అవార్డులు అందుకున్న అల్లు అర్జున్, విజయ్ దేవరకొండ

- హైదరాబాద్ హైటెక్స్‌లో వైభవంగా తెలంగాణ గద్దర్ అవార్డుల ప్రదానోత్సవం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి చేతుల మీదుగా అవార్డుల అందజేత
- 'పుష్ప-2' చిత్రానికి ఉత్తమ నటుడిగా అల్లు అర్జున్‌కు పురస్కారం
- ఉత్తమ నటిగా నివేదా థామస్, ఉత్తమ దర్శకుడిగా నాగ్ అశ్విన్ (కల్కి)
- ఉత్తమ హిస్టారికల్ ఫిల్మ్‌గా 'రజాకార్', ఉత్తమ తొలి చిత్రంగా 'కమిటీ కుర్రోళ్లు'

2లో







## ప్రపంచ టాప్-20 కుబేరుల జాబితాలో మనవాళ్లు..

(మొదటిపేజీ తరువాయి)

సత్తా చాటారు. బ్లూమ్‌బర్గ్ బిలియనీర్స్ జాబితాలో టాప్ 20లో ముఖేష్ అంబానీ, ఆదానీ గ్రూప్ సంస్థల ఛైర్మన్ గౌతమ్ ఆదానీలు స్థానాలు దక్కించుకోగా, టాప్ 100లో తొమ్మిది మంది భారతీయ వ్యాపార దిగ్గజాలు చోటు దక్కించుకున్నారు. ప్రతి ఏటా బ్లూమ్‌బర్గ్ ప్రపంచ కుబేరుల జాబితాను విడుదల చేస్తుంది. ఈ క్రమంలో ఈ ఏడాది బ్లూమ్‌బర్గ్ బిలియనీర్స్ జాబితాను తాజాగా విడుదల చేసింది. బ్లూమ్‌బర్గ్ ఇండెక్స్ 500 అత్యంత ధనవంతుల జాబితాలో భారతదేశం నుంచి ముఖేష్ అంబానీ (17వ స్థానం), గౌతమ్ ఆదానీ (20), శివనాడార్ (41), షాపూర్ మిస్త్రీ (52), సావిత్రి జిందాల్ (59), అజీమ్ ప్రేమ్ జీ (69), సునీల్ మిట్టల్ (73), దిలీప్ సంఘ్వీ (79), లక్ష్మీ మిట్టల్ (86వ స్థానం)లు వంద స్థానాల్లోపు ఉన్నారు.

## రేవంత్ రెడ్డి చేతుల మీదుగా అవార్డులు అందుకున్న, అల్లు అర్జున్, విజయ్ దేవరకొండ

హైదరాబాద్‌లోని హైటెక్స్ వేదికగా తెలంగాణ గద్దర్ అవార్డుల ప్రదానోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క హాజరై, చలనచిత్ర రంగంలో విశేష ప్రతిభ కనబరిచిన పలువురు కళాకారులు, సాంకేతిక నిపుణులకు పురస్కారాలు అందజేశారు. ప్రముఖ నటుడు అల్లు అర్జున్ 'పుష్ప 2' సినిమాలో కనబరిచిన అద్భుతమైన నటనకు గాను ఉత్తమ నటుడిగా తెలంగాణ ప్రభుత్వ గద్దర్ అవార్డును అందుకున్నారు. ఆయన నటనకు విమర్శకుల ప్రశంసలతో పాటు ప్రేక్షకుల నుంచి విశేష ఆదరణ లభించిన విషయం తెలిసిందే. ఈ అవార్డును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఆయన స్వీకరించారు. ఈ వేడుకలో పలు విభాగాల్లో అవార్డులను ప్రకటించారు. ఉత్తమ నటిగా నివేదా థామస్ ఎంపికయ్యారు. 2024 సంవత్సరానికి గాను 'కల్కి' చిత్రానికి దర్శకత్వం వహించిన నాగ్ అశ్విన్ ఉత్తమ దర్శకుడిగా పురస్కారం అందుకున్నారు. చారిత్రక కథాంశంతో తెరకెక్కిన 'రజాకార్' చిత్రం ఉత్తమ చారిత్రాత్మక చిత్రంగా నిలవగా, 'కమిటీ కుర్రోళ్లు' ఉత్తమ తొలి చిత్రంగా అవార్డును దక్కించుకుంది. ఎన్టీఆర్ నేషనల్ ఫిల్మ్ అవార్డును నందమూరి బాలకృష్ణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు. 'కాంతారావు ఫిల్మ్ అవార్డు'ను విజయ దేవరకొండ, 'బీఎన్ రెడ్డి ఫిల్మ్ అవార్డు'ను సుకుమార్, 'రఘుపతి వెంకయ్య అవార్డు'ను యండమూరి వీరేంద్రనాథ్, 'నాగిరెడ్డి అండ్ చక్రపాణి ఫిల్మ్ అవార్డు'ను అట్లూరి పూర్ణ చంద్రరావు, 'పైడి జైరాజ్ అవార్డు'ను మణిరత్నం అందుకున్నారు.

## ఆధార్ ఉచిత అప్‌డేట్ గడువు మళ్ళీ పొడిగింపు

ఆధార్ కార్డు వినియోగదారులకు భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (యూఐడీఏఐ) శుభవార్తను అందించింది. ఆధార్ వివరాలను ఉచితంగా అప్‌డేట్ చేసుకునేందుకు ఇచ్చిన గడువును మరోసారి పొడిగించింది. ఈ ఉచిత సేవలకు వాస్తవానికి నేటితో (జూన్ 14) గడువు ముగియాల్సి ఉండగా, దానిని మరో ఏడాది పాటు, అంటే 2026 జూన్ 14వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు యూఐడీఏఐ 'ఎక్స్' వేదికగా ప్రకటించింది. ఆధార్‌ను అప్‌డేట్‌గా ఉంచేందుకు డాక్యుమెంట్లను ఉచితంగా అప్‌లోడ్ చేసుకునే అవకాశాన్ని మరోసారి కల్పిస్తున్నామని, దీనివల్ల లక్షలాది మందికి ప్రయోజనం చేకూరుతుందని యూఐడీఏఐ వెల్లడించింది. ఆధార్ కార్డులోని వివరాలను ఎప్పటికప్పుడు తాజాగా ఉంచుకోవడం చాలా ముఖ్యం. ఇందుకోసం గుర్తింపు ధృవీకరణ పత్రం (పీఓఐ), చిరునామా ధృవీకరణ పత్రం (పీఓఏ)లను ఆన్‌లైన్‌లో ఉచితంగా అప్‌లోడ్ చేసుకునే సౌకర్యాన్ని కల్పిస్తోంది. వివాహం, ఉన్నత చదువులు లేదా ఉద్యోగ రీత్యా నివాసం మారిన వారికి ఈ అవకాశం ఎంతగానో ఉపయోగపడుతుంది. అలాగే, ఆధార్ కార్డు పొంది పదేళ్లు పూర్తయిన ప్రతి ఒక్కరూ తమ వివరాలను తప్పనిసరిగా అప్‌డేట్ చేసుకోవాలని యూఐడీఏఐ గతంలోనే స్పష్టం చేసింది. ఈ ఉచిత అప్‌డేట్ సేవలను 'మై ఆధార్' పోర్టల్ ద్వారా పొందవచ్చు. గతంలో ఆధార్ కేంద్రాలకు వెళ్లి వివరాలను మార్చుకోవాలంటే రూ. 50 రుసుము చెల్లించాల్సి ఉండేది. ఇప్పుడు ఆన్‌లైన్‌లో ఎటువంటి ఖర్చు లేకుండానే ఈ ప్రక్రియను పూర్తి చేసుకోవచ్చు. ఆన్‌లైన్‌లో ఆధార్ వివరాలు అప్‌డేట్ చేసుకునే విధానం ముందుగా యూఐడీఏఐ అధికారిక వెబ్‌సైట్‌లోకి వెళ్లి, మీ ఆధార్ నంబర్‌తో లాగిన్ అవ్వాలి. మీ రిజిస్టర్డ్ మొబైల్ నంబర్‌కు వచ్చిన ఓటీపీని ఎంటర్ చేసి లాగిన్ అయిన తర్వాత, మీ ప్రస్తుత వివరాలు తెరపై కనిపిస్తాయి. వాటిని ఒకసారి సరిచూసుకుని, ఏవైనా మార్పులు ఉంటే వాటిని సరిచేయాలి. లేదా అన్నీ సరిగ్గా ఉంటే, ఆ వివరాలను ధృవీకరించి 'నెక్స్ట్' బటన్‌పై క్లిక్ చేయాలి. ఆ తర్వాత, అవసరమైన డాక్యుమెంట్లను డ్రాప్‌డౌన్ జాబితా నుంచి ఎంచుకోవాలి. వాటి స్కాన్ చేసిన కాపీలను అప్‌లోడ్ చేసి, 'సబ్మిట్' బటన్‌పై క్లిక్ చేయాలి. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత మీకు 14 అంకెల 'అప్‌డేట్ రిక్వెస్ట్ నంబర్' (యూఆర్‌ఎన్) వస్తుంది. ఈ నంబర్‌తో మీ అప్లికేషన్ స్టేటస్‌ను ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు.

## ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి 8 ట్రాక్టర్ల ఇసుక ఉచితం

* పదేళ్ల తర్వాత ప్రజా పాలనలో ఇందిరమ్మ ఇళ్ల పథకం: మంత్రి పొన్నం
* రూ. 5 లక్షల ప్రభుత్వ సాయం.. అవసరమైతే మహిళా సంఘాల నుంచి అదనంగా లక్ష రుణం
* 400 నుంచి 600 చదరపు అడుగుల్లో ఇల్లు కట్టుకోవాలన్న మంత్రి




తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం లబ్ధిదారులకు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ శుభవార్త తెలిపారు. ఈ పథకం కింద ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం అందిస్తున్న సహాయం గురించి వివరిస్తూ ఆయన 'ఎక్స్' వేదికగా ఒక వీడియోను విడుదల చేశారు. "ఇందిరమ్మ ఇంటి నిర్మాణం కోసం 8 ట్రాక్టర్ల ఇసుకను ఉచితంగా అందించడంతో పాటు విడతల వారీగా రూ. 5 లక్షలు అందజేస్తున్నాం" అని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ఇంటి నిర్మాణం 400 నుంచి 600 చదరపు అడుగుల విస్తీర్ణంలోపు ఉండాలని ఆయన సూచించారు. లబ్ధిదారులకు అవసరమైతే మహిళా సంఘాల ద్వారా లక్ష రూపాయల వరకు రుణం ఇప్పించే ఏర్పాటు కూడా ప్రభుత్వం చేస్తుందని మంత్రి హామీ ఇచ్చారు. "పది సంవత్సరాల సుదీర్ఘ విరామం తర్వాత, ఇప్పుడు ప్రజా పాలన ప్రభుత్వంలో మళ్లీ ఇందిరమ్మ ఇళ్లు వస్తున్నాయి. ఎలాంటి ఆటంకాలు లేకుండా లబ్ధిదారులు తమ ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకోవాలి" అని పొన్నం ప్రభాకర్ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల పథకం లబ్ధిదారులందరికీ ఆయన అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని, లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



## అంతరిక్ష ప్రయోగంలో పెను ముప్పు తప్పించిన ఇస్రో!

(మొదటిపేజీ తరువాయి)

యాక్సియమ్ 4 మిషన్ ప్రయోగం తొలుత వాయిదా పడింది. లోపాలను సరిదిద్దిన అనంతరం, జూన్ 19న ప్రయోగాన్ని చేపట్టేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

**స్పేస్‌ఎక్స్ రాకెట్‌లో లోపం గుర్తింపు**

యాక్సియమ్ 4 మిషన్ ప్రయోగానికి సిద్ధమవుతున్న ఫాల్కన్ 9 రాకెట్ మొదటి దశలోని "ఆక్సిడైజర్ లైన్‌లో పగులు" ఉన్నట్లు వెల్లడైంది. స్పేస్‌ఎక్స్ సంస్థ మొదట దీనిని ఒక చిన్న "లీక్"గా పరిగణించి, తాత్కాలిక "పర్జ్" పరిష్కారంతో ప్రయోగానికి ముందుకు వెళ్లాలని భావించింది. అయితే, ద్రవ ఆక్సిజన్ అత్యంత వేగంగా మండే స్వభావం కలిగినందున, ఈ లోపం ప్రయోగ సమయంలో రాకెట్ గాల్లోకి లేచే సమయంలోనే భారీ వైఫల్యానికి దారితీసే ప్రమాదం ఉందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేశారు.

* **ఇస్రో చైర్మన్ దృఢ వైఖరి, భద్రతకు పెద్దపీట**

ఈ క్లిష్టపరిస్థితుల్లో ఇస్రో చైర్మన్ డాక్టర్ వి. నారాయణన్ వ్యోమగాముల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిచ్చారు. రాకెట్‌లో పూర్తిస్థాయి తనిఖీలు చేసి, లోపాన్ని సమూలంగా సరిదిద్దాలని, తక్కువ ఉష్ణోగ్రతల వద్ద లీకేజ్ పరీక్షలతో సహా అన్ని భద్రతా పరీక్షల ద్వారా ధృవీకరించాలని ఆయన స్పేస్‌ఎక్స్‌ను డిమాండ్ చేశారు. ఇస్రో చూపిన ఈ దృఢ వైఖరితో స్పేస్‌ఎక్స్ వెనక్కి తగ్గి, క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టగా, ఆక్సిడైజర్ లైన్‌లో "వెల్డ్ క్రాక్" ఉన్నట్లు నిర్ధారణ అయింది. భారత వ్యోమగామి శుభాంశు శుక్లా భద్రత విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని, అవసరమైతే మిషన్ నుంచి వైదొలగడానికి కూడా భారత్ సిద్ధపడింది.

* **పరిష్కారం దిశగా అడుగులు, నూతన ప్రయోగ తేదీ**

ఇస్రో పట్టుదల, సమన్వయంతో స్పేస్‌ఎక్స్ బృందాలు పగిలిన భాగాన్ని మార్చి, అవసరమైన అన్ని మరమ్మతులు, పరీక్షలు పూర్తిచేశాయి. ఫాల్కన్ 9 వాహనంలోని లోపాన్ని విజయవంతంగా పరిష్కరించినట్లు ఇస్రో, యాక్సియమ్ స్పేస్, స్పేస్‌ఎక్స్ సంయుక్తంగా ధృవీకరించాయి. వ్యోమగాముల భద్రతకు పెద్దపీట వేస్తూ, యాక్సియమ్ 4 మిషన్‌ను జూన్ 19న ఫ్లోరిడాలోని కెన్నెడీ అంతరిక్ష కేంద్రం నుంచి ప్రయోగించేందుకు ప్రస్తుతం ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇస్రో తీసుకున్న నిర్ణయాత్మక చర్యలు, భద్రతా నిబద్ధత అంతర్జాతీయంగా ప్రశంసలు అందుకుంటున్నాయి.

## బాధిత కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున ఎయిరిండియా అదనపు సాయం

* అహ్మదాబాద్ విమాన ప్రమాద మృతుల కుటుంబాలకు ఎయిర్ ఇండియా అండ
* ఒక్కో కుటుంబానికి రూ. 25 లక్షల మధ్యంతర ఆర్థిక సాయం ప్రకటన
* ప్రాణాలతో బయటపడిన ప్రయాణికుడికి కూడా ఇదే మొత్తం
* టాటా సన్స్ ప్రకటించిన రూ. కోటి సాయానికి ఇది అదనం
* గురువారం జరిగిన ప్రమాదంలో 241 మంది దుర్మరణం
* క్షేత్రస్థాయిలో సహాయక చర్యలు కొనసాగిస్తున్నామని వెల్లడి



అహ్మదాబాద్‌లో గురువారం జరిగిన ఘోర విమాన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన ప్రయాణికుల కుటుంబాలకు అండగా నిలుస్తున్నట్లు ఎయిర్ ఇండియా ప్రకటించింది. ఈ దుర్ఘటనలో మరణించిన వారి కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. 25 లక్షలు (సుమారు 21,000 బ్రిటిష్ పౌండ్లు) మధ్యంతర చెల్లింపుగా అందించనున్నట్లు శనివారం వెల్లడించింది. అలాగే ప్రాణాలతో బయటపడిన ఏకైక ప్రయాణికుడికి కూడా తక్షణ ఆర్థిక అవసరాల నిమిత్తం ఈ మేరకు రూ.25 లక్షలు అందించనున్నట్టు తెలిపింది. ఈ ఈ మేరకు ఎయిర్ ఇండియా తమ అధికారిక ఎక్స్ ఖాతాలో ఒక ప్రకటన విడుదల చేసింది. టాటా సన్స్ ఇప్పటికే ప్రకటించిన రూ. 1 కోటి సహాయానికి ఇది అదనమని ఎయిర్ ఇండియా స్పష్టం చేసింది. "ఇటీవల జరిగిన ప్రమాదంలో దురదృష్టవశాత్తూ ప్రాణాలు కోల్పోయిన ప్రయాణికుల కుటుంబాలకు ఎయిర్ ఇండియా సంఘీభావం తెలుపుతోంది. ఈ అత్యంత క్లిష్ట సమయంలో క్షేత్రస్థాయిలో మా బృందాలు సాధ్యమైనంత వరకు అన్ని రకాల సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేస్తున్నాయి" అని ప్రకటనలో పేర్కొంది. గురువారం మధ్యాహ్నం అహ్మదాబాద్‌లోని సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి టేకాఫ్ అయిన కొద్దిసేపటికే ఎయిర్ ఇండియాకు చెందిన బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్ విమానం (ఏఐ171) కుప్పకూలింది. ఈ విమానంలో 230 మంది ప్రయాణికులు, 12 మంది సిబ్బంది ఉండగా, ఒక ప్రయాణికుడు మినహా మిగిలిన 241 మంది మరణించినట్లు ఎయిర్ ఇండియా ధృవీకరించింది. విమానం సమీపంలోని ఒక వైద్య కళాశాల ప్రాంగణంలో కూలిపోయిన విషయం తెలిసిందే. ప్రమాదంలో ప్రాణాలతో బయటపడిన ఏకైక ప్రయాణికుడి ఆరోగ్యం వేగంగా మెరుగుపడుతోందని సమాచారం.

## హైదరాబాద్ పబ్‌లలో డ్రగ్స్ కలకలం.. నలుగురు అరెస్ట్

హైదరాబాద్‌లోని ప్రముఖ పబ్‌లలో మాదకద్రవ్యాల వినియోగంపై సైబరాబాద్ పోలీసుల స్పెషల్ ఆపరేషన్స్ టీమ్ (ఎస్‌ఓటీ) ఉక్కుపాదం మోపింది. నిన్న రాత్రి గచ్చిబౌలి, మాదాపూర్ ప్రాంతాల్లోని పలు పబ్‌లపై ఆకస్మిక దాడులు నిర్వహించి, గంజాయి సేవించిన నలుగురు యువకులను అదుపులోకి తీసుకుంది. వీరిలో ఒక డీజే ప్లేయర్ కూడా ఉండటం గమనార్హం. నగరంలోని పబ్‌లలో డ్రగ్స్ వినియోగం జరుగుతోందన్న విశ్వసనీయ సమాచారం మేరకు సైబరాబాద్ ఎస్‌ఓటీ



పోలీసులు శుక్రవారం రాత్రి దాడులు చేపట్టారు. ముఖ్యంగా గచ్చిబౌలిలోని ఎస్ఎల్ఎస్ టెర్మినల్ మాల్‌లో ఉన్న క్లబ్ రౌగ్ పబ్‌తో పాటు ఫ్రాట్ హౌస్ పబ్‌లు నిబంధనలకు విరుద్ధంగా కార్యకలాపాలు సాగిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ దాడుల్లో భాగంగా క్లబ్ రఫ్ పబ్‌లో ఉన్న కొందరు యువకులకు పోలీసులు అక్కడికక్కడే డ్రగ్స్ పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో నలుగురు యువకులు గంజాయి సేవించినట్లు నిర్ధారణ అయింది. పట్టుబడిన వారిలో డీజే ప్లేయర్ శివ కూడా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. దీంతో డ్రగ్స్ తీసుకున్నట్లు తేలిన నలుగురినీ పోలీసులు వెంటనే అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై మాదాపూర్ పోలీసులు నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సెస్ (NDPS) యాక్ట్ కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు.

# కాలనీలో మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే తన లక్ష్యం

*** బీఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్**



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : కాలనీలో మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే తన లక్ష్యమని బీఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ అన్నారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి 20వ డివిజన్ కాకతీయ నగర్ లో బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ అధికారులతో కలిసి శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా గండిమైసమ్మ బాచుపల్లి ప్రధాన రహదారిలో డాక్టర్ రెడ్డీస్ వద్ద సిగ్నల్ ఏర్పాటుచేయాలని, అదే విధంగా మౌలిక వసతుల కల్పనలో భాగంగా సీసీ రోడ్డు పనులు, పార్కులను అభివృద్ధి చేయాలని కోరారు. అనంతరం బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ మాట్లాడుతూ పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా రోజు రోజుకు వెలుస్తున్న కొత్త కాలనీలలో మౌలిక వసతుల కల్పనకు ప్రణాళికలు రూపొందించి ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పరుస్తున్నామన్నారు. రానున్న రోజుల్లో కాకతీయ నగర్ కాలనీలో అన్ని రకాల మౌలిక వసతులను కల్పిస్తానని అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ ప్రశాంత్, మేనేజర్ పవన్, డీఈ వసంత, మేనేజర్ జై రాజ్, శానిటేషన్ ఇంచార్జ్ సుకృత రెడ్డి, విద్యుత్ ఏఈ శశిదర్, మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, ఎన్ఎంసి బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్, మాజీ కార్పొరేటర్లు పైడి మాధవి, బాలాజీ నాయక్, పెద్దిరెడ్డి సుజాత, బొర్రా దేవి చందు ముదిరాజ్, మాజీ కో ఆప్షన్ సభ్యులు చంద్రగిరి జ్యోతి సతీష్, నాయకులు సాంబ శివ రెడ్డి, స్వామి, వైయస్, ప్రవీణ్, అనిల్, సతీష్ రెడ్డి, ప్రదీప్, బొబ్బ శ్రీనూ, బిక్షపతి, మేకల మధుసూదన్, దుసకంటి వెంకటేష్, విద్య సాగర్, జలగం చంద్రయ్య, యువ నాయకులు ఆనంద్ రెడ్డి, కాకతీయ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు విజయ్, ఉపాధ్యక్షుకు రాజేంద్ర, ప్రధాన కార్యదర్శి వినోద్, కోశాధికారి దశరథ్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## శారీరక దృఢత్వానికి, మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం

*** బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి. వివేకానంద్**



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : శారీరక దృఢత్వానికి, మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతగానో దోహదపడుతాయని బీఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ అన్నారు. సుభాష్ నగర్ డివిజన్ ఎస్.ఆర్.నాయక్ నగర్ లోని బాడ్మింటన్ ఇండోర్ షటిల్ కోర్ట్ నందు ఏస్ స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న బాడ్మింటన్ టోర్నమెంట్ ను బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ శనివారం ప్రారంభించారు. అనంతరం టాస్ వేసి టోర్నమెంట్ ను ప్రారంభింపచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలలో గెలుపు ఓటములు సహజమన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జి.హేమలతా సురేష్ రెడ్డి, మేడ్చల్ జిల్లా ఫిషరీస్ కోఆపరేటివ్ చైర్మన్ మన్నె రాజు, స్థానిక బిఆర్ఎస్ నాయకులు, ఎస్.ఆర్. నాయక్ నగర్, అపురూప కాలనీ, మోడీ బిల్డర్స్ కాలనీల కార్యవర్గ సభ్యులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచంలోనే బలమైన శక్తిగా భారత్‌ను తీర్చిదిద్ధుతున్న ప్రధాని మోడీ

**- బిజెపి ముస్తాబాద్ మండల అధ్యక్షుడు సొల్ల క్రాంతి కుమార్**



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: అభివృద్ధి, సంక్షేమంతో పాటు దేశ రక్షణ, తీవ్రవాదుల ఏరివేతతో ప్రపంచ దేశంలోనే బలమైన శక్తిగా భారత్‌ను ప్రధాని నరేంద్ర మోడీ తీర్చిదిద్ధుతున్నారని బిజెపి ముస్తాబాద్ మండల అధ్యక్షుడు సొల్ల క్రాంతి కుమార్ అన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ఏర్పడి 11 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా ముస్తాబాద్ మండల కేంద్రంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సబ్ కా సాథ్.. సబ్ కా వికాస్.. సబ్ కా ప్రయత్న్.. సబ్ కా విశ్వావాస్ అనే మంత్రంతో ప్రతి పౌరుడిని అభివృద్ధి బాటలోకి తీసుకవచ్చిన ఘనత దేశ ప్రధాని నరేంద్ర మోడీదేని అన్నారు. గడిచిన 11 సంవత్సరాలలో ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశం సంక్షేమం, అభివృద్ధి మార్గంలో నడిచిందన్నారు. దేశం మొత్తం వికిసిత్ భారత్ లక్ష్యాన్ని చేరే దిశగా ఏకతాటిపై ముందుకు సాగుతుందని తెలిపారు. నూతన, స్వయంపూర్ణ, సురక్షిత, సాధికార, అభివృద్ధి చెందిన భారత్‌ను నిర్మించడంలో మనందరిలో దృఢమైన సంకల్పం ఉందన్నారు. ఇది ప్రధాని మోదీ కల మాత్రమే కాదు, 140 కోట్ల భారతీయులందరి కలగా మారిందని వెల్లడిచారు. దేశ వ్యాప్తంగా ఎలాంటి అవనీతికి తావివ్వకుండా అభివృద్దే లక్ష్యంగా కేంద్ర సర్కార్ ముందుకు సాగుతుందని వెల్లడిచారు .రానున్న రోజుల్లో తెలంగాణలో బిజెపి అధికారం దక్కించుకోవడంతోపాటు, కేంద్రంలో కమలం మరోమారు అధికారంలోకి రాబోతుందని వెల్లడిచారు. అనేక పథకాలను ప్రతి పేదవాడికి చేరే విధంగా కృషి చేస్తున్న ప్రధాని మోదీకి ప్రతి ఒక్కరం అండగా ఉంటూ దేశాన్ని మరింత అభివృద్ధి బాటలో నడిపించుకుందామని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మట్ట వెంకటేశ్వర్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి మల్లారపు సంతోష్ రెడ్డి, జిల్లా కౌన్సిల్ మెంబర్ మేరుగు అంజాగౌడ్, పట్టణాధ్యక్షులు మెంగని మహేందర్, మండలా ఉపాధ్యక్షులు ఏదునూరి గోపి, గుండవేని తిరుపతి, జిలెళ్ళ మల్లేశం, నాయకులు వరి వెంకటేశ్, చిట్నేని శ్రీనివాస్ రావు, పప్పుల శ్రీకాంత్, తాండ్ర రామ్ గోపాల్, కోల క్రిష్ణ గౌడ్, బుర్ర శ్రీనివాస్ గౌడ్, చీకోటి మహేష్, బాల్ రెడ్డి, భగత్ రెడ్డి తదితరులున్నారు.

## అనారోగ్యంతో బాధపడుతున్న మాజీ ఉప సర్పంచ్ సలీంను పరామర్శించిన ఎమ్మెల్యే



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న బాచుపల్లి మాజీ ఉప సర్పంచ్, మాజీ కో ఆప్షన్ సభ్యులు సలీంను శనివారం బాచుపల్లిలోని వారి నివాసంలో బిఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ పాల్గొని పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆయన ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. సలీమ్ ను పరామర్శించిన వారిలో మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, ఎన్ఎంసి బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్, మాజీ కార్పొరేటర్లు బాలాజీ నాయక్, బొర్రా దేవి చందు ముదిరాజ్, మాజీ కో ఆప్షన్ సభ్యులు చంద్రగిరి జ్యోతి సతీష్, స్థానిక నాయకులు ఉన్నారు.

## ఘనంగా ఎండి జహంగీర్ జన్మదిన వేడుకలు



అంబర్ పేట్, ప్రజా స్ఫూర్తి : బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఎండి జహంగీర్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. బాలకృష్ణ నగర్ కాలనీ నాయకులు , వివిధ పార్టీలకు చెందిన నాయకులు, ఎండి జహంగీర్ కు కాలనీ అంతా పండగ వాతావరణంతో జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ మేరకు ఎండి జహంగీర్ మాట్లాడుతూ ప్రజాసేవ కోసమై నేను అని అన్నారు. ప్రజల కష్టం తీర్చడంలో ముందుండి ప్రజల గుండెల్లో నిలిచినందుకు నాకు సంతోషంగా ఉందని వారు అన్నారు. ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అడుగుజాడల్లో నడుస్తూ గొప్ప నాయకుడిగా పేరు తెచ్చుకోవడం సంతోషంగా ఉందని మన అందరి నాయకుడు లక్ష్మారెడ్డి ఖ్యాతిని పెంచడంతోపాటు నిత్యం ప్రజల గుండెల్లో ఉండటం వారి స్ఫూర్తి నాకు నిదర్శనం అని అన్నారు.

## వావ్ కిడ్స్ పెబ్బల్ ప్లే స్కూల్ ప్రారంభం



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : పిల్లలు విద్యను కష్టంగా కాకుండా ఆడుతూ పాడుతూ అభ్యసించేలా ప్లే స్కూళ్లు ఉపయోగపడతాయని బిఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అన్నారు. శనివారం నిజాంపేట్ కార్పొరేషన్ పరిధి బాచుపల్లి కాంతి నగర్ లో నూతనంగా ఏర్పాటు చేసిన వావ్ కిడ్స్ పెబ్బల్ ప్లే స్కూల్ ను బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ పాల్గొని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రమ్య, అడ్మిన్ ఇంచార్జ్ వరలక్ష్మి, నిజాంపేట్ మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, ఎన్ఎంసి బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్, మాజీ కార్పొరేటర్లు పైడి మాధవి, బాలాజీ నాయక్, పెద్దిరెడ్డి సుజాత, బొర్రా దేవి చందు ముదిరాజ్, మాజీ కో ఆప్షన్ సభ్యులు చంద్రగిరి జ్యోతి సతీష్, నాయకులు సాంబ శివ రెడ్డి, స్వామి, వైయస్ , ప్రవీణ్, అనిల్, సతీష్ రెడ్డి, ప్రదీప్, బొబ్బ శ్రీనూ, బిక్షపతి, మేకల మధుసూదన్, దూసకంటి వెంకటేష్, విద్యా సాగర్,జల్గం చంద్రయ్య, యువ నాయకులు ఆనంద్ రెడ్డి, ఇమ్మడి వేణు, తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి సంస్థ డైరెక్టర్ (పా)గా గౌతమ్ పోట్రు



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: సింగరేణి సంస్థ డైరెక్టర్ (పా)గా గౌతమ్ పోట్రును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు సింగరేణి డైరెక్టర్ (పా)గా ఇతర డైరెక్టర్లు అదనపు బాధ్యతలు నిర్వర్తించారు. ఎంతో కాలంగా ఖాళీగా ఉన్న ఈ పోస్టులోకి ప్రభుత్వం మల్కాజిగిరి మేడ్చల్ జిల్లా కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న గౌతమ్ పోట్రును పూర్తి స్థాయి అధికారిగా నియమించింది. డైరెక్టర్ (పా ) కార్మిక సంక్షేమం, అపరిష్కృత□సమస్యలు, పర్సనల్ విభాగం, పారిశ్రామిక సంబంధాలు, విద్య, ఆరోగ్యం, వైద్య, సామజిక అంశాలు చూడాల్సి ఉంటుంది. ఒకవైపు గుర్తింపు సంఘంగా ఏఐటీయూసీ, మరోవైపు అధికార పార్టీ అనుబంధ సంఘం ఐఎన్టీయూసీ. ఈ రెండింటి మధ్య కొత్త డైరెక్టర్ (పా) సమన్వయం చేసుకుంటూ సమస్యలను పరిష్కరించాల్సి ఉంటుంది. ఇదిలా ఉండగా నూతనంగా నియమితులైన డైరెక్టర్ (పా)కు సమస్యలు స్వాగతం పలకనున్నాయి. సింగరేణి సంస్థ అంటే వెలుగులు విరజిమ్మే పవర్ ప్లాంట్ లకు బొగ్గును సరఫరా చేయడమే అనుకుంటారందరూ... కాని బోలెడు కార్మిక సమస్యలు సంస్థలో పేరుకుపోయి ఉన్నాయి. ఉత్పత్తి, ఉత్పాదకత, రక్షణ, సంక్షేమం ఇలా ఎన్నో సమస్యలతో సింగరేణి సంస్థ కొట్టుమిట్టాడుతోంది. సంస్థలో కార్మికులు, అధికారులు కలిపి సుమారు 43 వేల మంది విధులు నిర్వర్తిస్తూ 24 గంటల పాటు బొగ్గు ఉత్పత్తి కోసం కృషి చేస్తుంటారు. ఇంత పెద్ద సంస్థకు పూర్తి స్థాయి డైరెక్టర్ (పా) ఉండాల్సి ఉండగా గత కొన్నాళ్లుగా ఆ పోస్టు ఇన్‌చార్జిల పాలనలో ఉండటంతో సమస్యలన్నీ పరిష్కారానికి నోచుకోకుండాపోయాయి.

కాగా కార్మికుల హక్కుల కోసం పోరాడుతున్నామని ప్రగల్భాలు పలికే కార్మిక సంఘాలు కూడా శాశ్వత అధికారి నియామకం గురించి పట్టించుకోలేదనే విమర్శలున్నాయి. చివరకు గుర్తింపు సంఘంతోపాటు ప్రభుత్వ అనుబంధ సంస్థ కూడా ప్రభుత్వానికి సమస్యను చెప్పుకోలేక పోయింది. ఎట్టకేలకు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పూర్తిస్థాయి అధికారిని నియమించడంతో కార్మిక వర్గం హర్షం వ్యక్తం చేస్తోంది. డైరెక్టర్ (పా) నియామకంతో తమ సమస్యలు పరిష్కరించబడతాయని కార్మికులు పేర్కొంటున్నారు.

## ఆలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలు

*** బిఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్**



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : ఆలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలని బిఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ అన్నారు. గాజుల రామారం డివిజన్ మిథిలా నగర్ లోని శ్రీ విజయదుర్గా దేవాలయ అష్టమ వార్షికోత్సవ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శక్తి స్వరూపిణీ అయిన అమ్మవారిని కలవడం ద్వారా విజయప్రాప్తి కలుగుతుందని, అమ్మవారి దయతో ప్రజలంతా సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో జీవించాలన్నారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, పార్టీ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్, సీనియర్ నాయకులు రంగరాయ ప్రసాద్, దేవాలయ కమిటీ సభ్యురాలు రజిని, అమరేశ్వరీ, సీమవో, పద్మా, శివలీల, భవాని, వాణి, మిథిలా నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ చైర్మన్ ఠాగూర్, కార్యవర్గ సభ్యులు సురేష్, చెంగల్ రాయుడు, వెలగపూడి శ్రీనివాస్, చంద్రమోహన్, ప్రవీణ్, శివ, రాజా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## నీట్ లో ఎస్ఆర్ కు 100 వ ర్యాంక్..



ప్రజా స్ఫూర్తి, నల్లగొండ : శనివారం విడుదలైన నీట్ ఫలితాల్లో నల్లగొండ పట్టణం చర్లపల్లిలోని ఎస్ ఆర్ కళాశాల విద్యా ర్థిని బచ్చు ప్రియాంక ఆలిండియా స్థాయిలో 100వ ర్యాంకు సాధించింది. ఈ సందర్భంగా పాఠశాల జోనల్ ఇన్‌చార్జి దోనాల శ్రీనివాస్‌రెడ్డి విద్యార్థినిని సన్మానించి మాట్లాడుతూ ఏ పోటీ పరీక్షలు అయినా ఎస్ఆర్ విద్యా సంస్థల నల్గొండ విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాదిస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా నల్గొండ బ్రాంచ్ లో నీట్ చదివిన 22 మంది లో 10 మంది మెడికల్ సీట్లు సాధించినట్లు తెలిపారు.. ఎస్ఆర్ విద్యాసంస్థల చైర్మన్ ఏనగందుల వరదారెడ్డి, డైరెక్టర్ సంతోశ్‌రెడ్డి, సీఈఓ సురేందర్‌రెడ్డి, నల్లగొండ బ్రాంచ్ అసిస్టెంట్ జోనల్ సతీశ్‌రెడ్డి, ప్రిన్సిపాల్లు మనోజు రెడ్డి , డీన్ కిషోర్ బాబు ఏ ఓ సరితా రెడ్డి అధ్యాపకులు వర్ధన్ ,ప్రసన్న ,శ్రీనివాస్,శోభ తదితరులు అభినందించారు.

## లోక్ అదాలత్ లో రాజీ పడితే ఇరు వర్గాలు గెలిచినట్లే

*** జడ్జి దేవరపల్లి కీర్తి చంద్రిక రెడ్డి,**



ప్రజాస్ఫూర్తి, ఇల్లందు : జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని ఇల్లందు మండల న్యాయ సేవ సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఉదయం స్థానిక ఇల్లందు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణంలో ఏర్పాటు చేసినారు. ఈ కార్యక్రమానికి ఇల్లందు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి దేవరపల్లి కీర్తి చంద్రిక రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ఉద్దేశిస్తూ వారు మాట్లాడుతూ లోక్ అదాలత్ ముఖ్య ఉద్దేశం కక్షిదారులు క్షణికావేశంలో పెట్టుకున్న పోలీస్ కేసులు రాజిపడదగిన, మనోవర్తి , గృహింస , చెక్ బౌన్స్ , ప్రామిసరీ నోటు కేసులు ఇట్టి కేసులలో ఇరువర్గాలు కోర్టుకు వచ్చి రాజి కుదుర్చుకున్నట్లైతే ఇరురవర్గాలు గెలిచినట్లే అవుతుంది. తద్వారా ఎంతో విలువైన కాలాన్ని, డబ్బును ఆదా చేసుకోవచ్చునని, అంతేకాకుండా ఒకసారి లోక్ అదాలత్ లో రాజీ పడినట్లయితే పైకోర్టుకు వెళ్లి అప్పీల్ అవకాశం ఉండదని. కక్షిదారులు గ్రామస్థాయిలో పెద్దమనుషుల సమక్షంలో రాజి చేసుకున్న కేసులలో వారు చేసే అగ్రిమెంట్లకు చట్టబద్ధత ఉండదని. కోర్టు వచ్చి లోక్ అదాలత్ ద్వారా రాజీ పడినట్లయితే చట్టబద్ధత ఉంటుందని , కక్షిదారులు పంతాలకు పోకుండ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోగలరని తెలిపినారు. అనంతరం ఇల్లందు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జడ్జి చేతుల మీదుగా కక్షిదారులకు మొక్కలు పంపిణీ చేసి విధిగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని తెలిపినారు. ఈ కార్యక్రమంలో జడ్జి తో పాటు ఇల్లందు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కే. ఉమామహేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కీర్తి కార్తిక్, సీనియర్ న్యాయవాదులు పెద్దూరి వెంకట నరసయ్య, పప్పుల గోపీనాథ్ దంతాల ఆనంద్, ఎస్, వెంకటేశ్వర్లు జూనియర్ న్యాయవాదులు ,పోలీస్ సిబ్బంది, కోర్టు సిబ్బంది ,బ్యాంకు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ మైక్రో ఫైనాన్స్, బ్యాంకుల ఆగడాలు అరికట్టాలి

*** సిపిఐ డిమాండ్**

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్ మైక్రో ఫైనాన్స్, ప్రైవేట్ బ్యాంకుల ఆగడాలు మితిమీరిపోతున్నాయని సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు కంచర్ల జమలయ్య ,మునగడప వెంకటేశ్వర్లు హెచ్చరించారు. రామవరం లోని ఏడు వార్డుల బాధితులు , మేషన్ కాలనీ, ప్రశాంత్ నగర్ పంచాయతీ తదితర ప్రాంతాల్లోని మైక్రో ఫైనాన్స్ బాధితులు సిపిఐ నాయకులను సంప్రదించి వారు కష్టాలను, ఫైనాన్స్ బ్యాంకులు పెట్టే ఇబ్బందులను వారికి వివరించారు. రామవరం పాత పోస్ట్ ఆఫీస్ ఏరియాలో గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు భూక్య శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రైవేట్ మైక్రో ఫైనాన్స్ బ్యాంకుల బాధితులతో సమావేశమై వారు మాట్లాడారు. ప్రైవేట్ బ్యాంకులో ఏజెంట్లు నిబంధనలకు విరుద్ధంగా రుణాలు ఇచ్చి ,నిబంధనలకు వ్యతిరేకంగా లబ్ధిదారులపై దాడులకు దిగటం చట్టరీత్య నేరమని అన్నారు. మహిళల యొక్క మానసిక స్థితిపై దౌర్జన్యాలు చేస్తున్నారని వారి యొక్క ఆగడాలను మానుకోకపోతే సిపిఐ ఆధ్వర్యంలో వారికి తగిన గుణపాఠం చెప్పవలసి ఉంటుందని హెచ్చరించారు. ఫైనాన్స్ నిబంధనలో ఉన్న ఇన్సూరెన్స్, వైద్యం మొదలైన సౌకర్యాలు ఉన్నాయని మాయ మాటలు చెప్పి పేద మధ్య తరగతి ప్రజలకు విచ్చలవిడిగా రుణాలు అందించి వారు కట్టలేని స్థితిలో వారిపై దౌర్జన్యానికి ,గొడవలకు దిగటం సరికాదని హెచ్చరించారు. వర్షాకాలంలో పనులు దొరకక స్కూల్ పిల్లలు



బుక్స్, ఫీజులు కట్టే టైంలో వాళ్లు నాలుగు నెలలు గడువు అడుగుతున్నారు తప్ప ఇచ్చిన అప్పును చెల్లించమని వారు చెప్పటం లేదని అన్నారు. తక్షణమే వారికి నాలుగు నెలల గడువు రుణాలు చెల్లించేందుకు అవకాశం ఇవ్వాలని వారికి విజ్ఞప్తి చేశారు. ఏజెంట్లు ఒక వ్యక్తికి ఎన్ని రకాల లోన్లు ఇవ్వచ్చో లేదా ఎన్నైనా ఇవ్వచ్చా మరి నిబంధనలో లేదా..! లేదా..! అని పరిశీలించుకోకుండా..! రకరకాల లోన్లు బాధితులకు అందించి వాళ్లు రుణాలు చెల్లించలేని ఊబిలో నెట్టటం వారి కమిషన్ల కోసం కాదని ప్రశ్నించారు. తక్షణమే మైక్రో ఫైనాన్స్, ప్రైవేట్ బ్యాంకుల ఏజెంట్లు వారి పద్ధతులు మార్చుకొని చట్ట పరిధిలో వారి విధులను నిర్వహించాలని వారికి సూచించారు .ఎవరైనా ఏజెంట్లు మహిళలకు ఇబ్బంది కలిగిస్తే వెంటనే వందకు సమాచారం అందించి వారి నుండి తక్షణ రక్షణ పొందాలని బాధితులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు తూముల శ్రీనివాస్ ,కనుకుంట్ల శ్రీనివాస్, జంజర్ల కృష్ణమూర్తి ,సర్వ వీరభద్రం ,మహిళా నాయకురాలు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



# పాలన చేతగాక కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం

*** కెటిఆర్ సేన రాష్ట్ర అధ్యక్షులు మెంగని మనోహర్**

ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: కాంగ్రెస్ నోటికివచ్చిన హామీలన్నీ ఇచ్చి ప్రజలను నమ్మబలికి గద్దెనెక్కిన పాలన చేతగాక తెలంగాణ ప్రజలను మోసం చేస్తున్న తీరును ప్రజలల్లో ఎండగడుతున్న బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందని కెటిఆర్ సేన రాష్ట్ర అధ్యక్షులు మెంగని మనోహర్ అన్నారు. శనివారం ముస్తాబాద్‌లో ఆయన మాట్లాడారు. సిఎం రేవంత్ రెడ్డి చేతుల్లో ఎసిబి కీలుబొమ్మగా పని చేస్తుందని ఆయన విమర్శించారు. ఫార్ములా ఈకార్ రేస్ నోటీసులపై స్పందించిన కేటీఆర్ తను లై డిటెక్టర్ పరీక్షలకు సిద్ధంగా ఉన్నానని, ఓటుకు నోటు అంశంలో రేవంత్ రెడ్డి కేసు కూడా ఎసిబి దగ్గర విచారణలో ఉన్నందున లై డిటెక్టర్ పరీక్షలకు రేవంత్ సిద్ధంగా ఉండాలన్న సవాలును స్వీకరించి రేవంత్ రెడ్డి దమ్ముంటే పరీక్షలకు రావాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పాలనతో రాష్ట్రాన్ని సర్వనాశనం చేసి అందినకాడికి దండుకొని పక్కకు జరగాలని రేవంత్ రెడ్డి, తన ప్రభుత్వం చూస్తున్నట్టుగా అనిపిస్తుందని ఆరోపించారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్ పార్టీ యూత్ మండల అధ్యక్షుడు శీలం స్వామి, కేటీఆర్ సేన మండల అధ్యక్షుడు వంగూరు దిలీప్, సీనియర్ నాయకులు ఎండి. జహంగీర్, కేటీఆర్ సేన సోషల్ మీడియా ఇన్‌చార్జ్ నరేంద్ర చారి, కేటీఆర్ సేన ఎల్లారెడ్డిపేట ఇన్‌ఛార్జి సాకీర్, మండల ప్రధాన కార్యదర్శి మనీష్, సురేష్, శేఖర్ చారి, రాజు, మల్లేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# రైతు నేస్తం కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి

*** జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్.**

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: ఈ నెల 16 సోమవారం జరుగు రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి రైతులతో ముఖాముఖి మాట్లాడుతారని, ఈ కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఆదేశించారు. సోమవారం నిర్వహించి రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా సాయంత్రం నాలుగు గంటలకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి రైతులతో ముఖాముఖి మాట్లాడుతున్న నేపథ్యంలో కార్యక్రమ ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో శనివారం కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ఉన్న 58 రైతువేదికలలో రైతు నేస్తం కార్యక్రమం నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. సోమవారం అన్ని రైతు వేదికలను పండుగ వాతావరణం లో మామిడి తోరణాలు, రంగవల్లులతో అలంకరించాలని అధికారులను ఆదేశించారు. సోమవారం మధ్యాహ్నం రెండున్నర గంటలకే రైతు వేదిక వద్దకు రైతులు చేరుకునేలా చర్యలు చేపట్టాలని అన్నారు. ఆడియో




మరియు వీడియోలో ఎటువంటి సాంకేతిక లోపాలు తలెత్తకుండా సరిచూసుకోవాలని ఏవైనా సమస్యలు ఉంటే రేపటిలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. రైతు వేదికలకు విచ్చేసే రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. మహిళా రైతులు కూడా పెద్ద ఎత్తున హాజరు అయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమానికి స్థానిక ప్రజాప్రతినిధులకు ఆహ్వానాలను పలకాలని అధికారులకు సూచించారు. ప్రతి రైతు వేదికలో రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ మరియు మండల స్థాయిలో ఎంత మంది రైతులకు ఎంత మొత్తంలో రైతు భరోసా జమ అవుతున్నదో వివరాలను అందుబాటులో ఉంచాలన్నారు. రైతు వేదికలకు పెద్ద ఎత్తున రైతులు హాజరవుతారు కాబట్టి, రైతు వేదికల వెలుపల ఏబిసిడి డ్రైవ్ పై అవగాహన కల్పించే విధంగా స్టాల్స్ ను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. రైతు నేస్తం కార్యక్రమానికి రైతు వేదిక పరిధిలో మునగ సాగు చేపట్టి లబ్ధి చేకూరిన రైతులను ఆహ్వానించి వారి ద్వారా ఇతర రైతులకు మునగ సాగు ద్వారా వచ్చే లాభాలపై అవగాహన కల్పించాలన్నారు. రైతు నేస్తం కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా ఉన్న ఏపీఎంలు కూడా హాజరు కావాలని, దాని ద్వారా వారు మహిళా సమైక్య సభ్యులకు అజోల్ల పెంపకం, బయోచార్ తయారీ, చేపల పెంపకం తదితర వాటిపై సభ్యులకు అవగాహన కల్పించడం ద్వారా వారు ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చు అని కలెక్టర్ సూచించారు. ఇంకుడు గుంతల నిర్మాణంలో దేశం మొత్తం జిల్లా వైపు చూస్తుందని దీనికి సహకరించిన ప్రతి అధికారి, ఉద్యోగస్తులను కలెక్టర్ అభినందించారు. రానున్న వర్షాకాలంలో ఎక్కడైతే వర్షం నీరు నిలుస్తుందో అక్కడ వెంటనే ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు.




# రక్త దానం చేయడం, అవయవ దానం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత

*** డా. నాగరాజు**

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: రక్త దానం చేయడం, అవయవ దానం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ప్రముఖ డాక్టర్ నాగరాజు అన్నారు. ప్రపంచ రక్త దాత దినోత్సవం సందర్భంగా సింగరేణి గర్ల్స్ హై స్కూల్ లో శనివారం యంగ్ ఇండియన్ బ్లడ్ డోనర్స్ క్లబ్ ఆధ్వర్యంలో రక్త దాతలను సన్మానించడమైనది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా వచ్చిన కొత్తగూడెం లోని ప్రముఖ డాక్టర్ నాగరాజు మాట్లాడుతూ యువత రక్త దానం చేయడానికి ముందుకు రావాలని, ప్రతి ఒక్కరు అవయవ దానం చేయుటకు ఓ బాధ్యతగా తీసుకొని ముందుకు రావాలని, యువతకు ప్రోత్సహిస్తున్న, యువతకు మార్గదర్శకంగా ఉన్న ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు జరప్ల బాలు ను అభినందించారు. ఫౌండేషన్ ముఖ్య సలహాదారులు , మోటర్ వెహికల్ ఇన్స్పెక్టర్ తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సంఘం వెంకట పుల్లయ్య మాట్లాడుతూ ప్రతి ఒక్కరు సమాజ సేవ చేయడానికి ముందుకు రావాలని, దీనిని ఓ ఫ్యాషన్ గా తీసుకోవాలని దీనికి గాను తమ వంతు సహకారాన్ని అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు జె. బాలు, ఫౌండేషన్ గౌరవ అధ్యక్షుడు లగడపాటి రమేష్ చంద్, యోగ గురువు గుములాపురం సత్యనారాయణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పూల్ సింగ్, ముజాహిదీన్, రాజేష్, జుబ్బు, సరిత, మునీలా, నిరంజన్, అజీమ్ ఖాన్, హైమద్ తదితరులు పాల్గొన్నారు.

# పోరాటం సామ్రాజ్యవాదులను గడగడలాడించిన విప్లవ కెరటం చేగువేరా

*** సిఐటియు కుత్బుల్లాపూర్ మండల అధ్యక్షులు కీలుకాని లక్ష్మణ్**

కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : పోరాటం సామ్రాజ్యవాదు లను గడగడలాడించిన విప్లవ కెరటం చేగువేరా అని సిఐటియు కుత్బుల్లాపూర్ మండల అధ్యక్షులు కీలుకాని లక్ష్మణ్ అన్నారు. చేగువేరా జయంతి సందర్భంగా సిఐటియు షాపూర్ నగర్ కార్యాలయంలో సిఐటియు డివైఎఫ్ఐ మహిళా సంఘం ఆధ్వర్యంలో చేగువేరా చిత్రపటానికి ఆయన పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేగువేరా సామ్రాజ్య వాదుల పెత్తనానికి వ్యతిరేకంగా పోరాటం సాగించారన్నారు. ప్రజలను పీడించే అమెరికా లాంటి దేశాలకు సింహస్వప్నమై స్వేచ్ఛ కోసం, సమానత్వం కోసం, పీడిత ప్రజల విముక్తి కోసం నిలబడ్డాడన్నారు. 1951 డిసెంబర్ నుంచి 1952 జూలై వరకు లాటిన్ అమెరికా దేశాలలో చేసిన మోటారు సైకిల్ యాత్ర చే జీవితంలో పెనుమార్పుకు కారణం అయింది. 'చే' ను విప్లవం వైపు ఎంతగానో ఆకర్షించిందన్నారు. అక్కడ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను చూసి చలించిపోయారన్నారు. ఆర్థిక అసమానతలు, ఏకస్వామ్య పెట్టుబడిదారీ వ్యవస్థ, వలసవాదం, సామ్రాజ్యవాదుల ఫలితంగానే



ఈ పరిస్థితి ఏర్పడిందని నిర్ణయానికి వచ్చాడు. పెట్టుబడిదారీ వ్యవస్థ లోని విషవృక్షాలు ఎంత బలంగా నాటుకున్నాయో తెలుసుకోవడానికి చే కు ఎక్కువ కాలం పట్టలేదు. చివరకు సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా తిరుగుబాటు చెయ్యాలని నిర్ణయానికి వచ్చాడు. అమెరికా సామ్రాజ్యవాదంతో నష్టపోతున్న దేశాలన్నీ ఒక్కటి కావాలని కోరుకున్నాడు. అందుకు సాయుధ పోరాటమే మార్గమని భావించేవాడు. లాటిన్ అమెరికా దేశాలలో దారిద్ర్యం ఎలా తిష్ట వేసిందో కళ్లారా చూశాడు. తిండి, ఇళ్లు, ఆరోగ్యం, విద్య తదితర సదుపాయాలు లేక ప్రజలు అర్ధాకలితో ఉన్న పరిస్థితులను చూసి చలించిపోయాడన్నారు. అతి తక్కువ కాలంలో క్యూబా విప్లవంలో కీలకంగా మారాడన్నారు. ఉత్తేజాన్నిచ్చే నాయకుడు చే. నేడు మన దేశంలో అవినీతి పెరిగింది.కొద్దిమంది వ్యాపార సంస్థల లాభాల కోసం కార్మికులు, పేదలు, రైతులు, కూలీల పైన భారాలు వేస్తూ సామాన్యుల పరిస్థితి మరింత అధ్వానంగా మార్చారన్నారు. మన పాలకులు ఇప్పటికే దళితులు ఆదివాసీలు మైనార్టీల పైన పెద్ద ఎత్తున దాడులు ప్రారంభమయ్యాయన్నారు. దేశ చరిత్రలో ఎన్నడూ లేనంత విధంగా నిరుద్యోగం పెరిగింది. ప్రతిఘటనపోరాటాలుచేసేందుకు ప్రజాతంత్ర శక్తులు ఏకం కావాల్సిన అవసరం ఉంది. యువత దోపిడీ లేని, అసమానతలు లేని సమ సమాజం కోసం చే స్ఫూర్తితో ముందుకు రావాలని అన్నారు ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ మండల అధ్యక్షులు ఆది నాగరాజు, సిఐటియు జిల్లా నాయకులు పసుల అంజయ్య, మహిళా సంఘం మండల అధ్యక్షురాలు రావుల స్వాతి, తదితరులు పాల్గొన్నారు .

# విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: ముస్తాబాద్ మండలం తెర్లుమద్ది గ్రామానికి చెందిన బైతి రాజయ్య (48) విద్యుదాఘాతానికి గురై శనివారం మృతి చెందాడు. ఇల్లు కడిగిన తర్వాత ఇంటి సర్వీస్ వైరు వరండలోని ఇల్లు కడిగిన నీటిలో పడింది . దాన్ని పక్కకు జరుపుతుండగా ప్రమాదవశాత్తు రాజయ్య విద్యుదాఘాతానికి గురై అక్కడే పడిపోయాడు. దీన్ని గమనించిన కుటుంబ సభ్యులు అతన్ని ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. ఈ మేరకు మృతుని కూతురు బైతి శ్రావణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ముస్తాబాద్ పోలీసులు తెలిపారు. మృతునికి ఇద్దరు కూతుళ్లు, ఒక కొడుకు ఉన్నారు. మృతుని భార్య 10 సంవత్సరాల క్రితమే చనిపోయింది.



# తిరుమలలో శుక్రవారం రికార్డు స్థాయిలో శ్రీవారి భక్తులకు దర్శనం



తిరుమల: తిరుమలలో నిన్న (శుక్రవారం) రికార్డు స్థాయిలో భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. సాధారణంగా శుక్రవారం అభిషేక సేవ ఉండటంతో భక్తులకు దర్శన సమయం రెండు.. మూడు గంటలకు పైగా తగ్గుతుంది. దీంతో ఆరోజు కేవలం 60వేల నుంచి 65 వేల మంది భక్తులు మాత్రమే స్వామివారిని దర్శించుకుంటారు. అయితే, ఉన్నతాధికారుల నిరంతర పర్యవేక్షణలో, వివిధ తితిదే విభాగాల సిబ్బంది సమన్వయంతో ఈ ఏడాది మే, జూన్‌లో శుక్రవారాల్లో సాధారణం కంటే అదనంగా 10వేల మందికి పైగా భక్తులకు శ్రీవారి దర్శన భాగ్యం లభించింది. వేసవి రద్దీ నేపథ్యంలో తిరుమలలో భక్తుల తాకిడి మే 15 నుంచి విపరీతంగా పెరిగింది. శుక్రవారాలైన మే 23న 74,374 మంది, మే 30న 71,721 మంది, జూన్ 6న 72,174 మంది, జూన్ 13న 75,096 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నట్టు తితిదే అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు.

# నిమ్స్ ఆసుపత్రిలో ప్రపంచ రక్తదాతల దినోత్సవం

నిమ్స్ ఆసుపత్రిలో ప్రపంచ రక్తదాతల దినోత్సవం ఘనంగా జరిగింది. రక్తదాన కేంద్రం హెచ్ఓడీ డా. సుధీర్ కుమార్ ఆధ్వర్యంలో ఉదయం 8 గంటలకు నిమ్స్ ఓపిడి పాత భవనం (సమాచార కేంద్రం) నుండి రక్తదాన కేంద్రం (ఎమర్జెన్సీ భవనం) వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో వైద్య విద్యార్థులు, రక్తదాన కేంద్ర సిబ్బంది, ఫిజియోథెరపీ, అలైడ్ హెల్త్ పారామెడికల్, నర్సింగ్ విద్యార్థులు, ఇతర డిపార్ట్మెంట్ సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రొ.డి




శాంతీ, డా. మురళీకృష్ణ , డా.మహేష్ కుమార్ రక్తదానం అవశ్యకత ను గురించి మాట్లాడారు.

**నూతన కోల్డ్ రూం ప్రారంభం...**

అనంతరం నూతనంగా 1000 బ్లడ్ యూనిట్ల భద్రపరిచగల సామర్థ్యం కలిగిన అడ్వాన్స్ టెక్నాలజీ కోల్డ్ రూమ్ ను డైరెక్టర్ ప్రో.నగరి బీరప్ప , మెడికల్ సూపరిండెంట్ ప్రో. నిమ్మ సత్యనారాయణ గారితో కలిసి ప్రారంభించారు. దీని ద్వారా మరింత ఎక్కువ స్థాయిలో రక్తాన్ని నిల్వ ఉంచే అవకాశం ఉందని , అత్యవసర సమయాల్లో ఇది ఎంతగానో ఉపయోగపడుతుందని ఈ సందర్భంగా వక్తలు పేర్కొన్నారు. ఇక రక్తదాతలకు డైరెక్టర్ గారి చేతుల మీదుగా సన్మాన కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా వైద్య, నర్సింగ్, పారామెడికల్, నిమ్స్ సిబ్బంది పెద్ద ఎత్తున రక్త దానం చేసారు.

ఈ కార్యక్రమంలో నిమ్స్ సిబ్బంది బిడుగు శేఖర్, జె.వెంకట రత్నం, సి.నాగేశ్వర రావు, భాస్కర్ రెడ్డి,సుజాత, చిరంజీవి, సేతులక్ష్మి, రేచల్,నీరజ , కాంట్రాక్ట్ టెక్నీషియన్స్, బ్లడ్ బ్యాంక్ స్టూడెంట్స్, పీజీ విద్యార్థులు, BSC స్టూడెంట్స్, బ్లడ్ బ్యాంక్ ఇతర సహాయక సిబ్బంది అలైడ్ హెల్త్ సైన్సు కాలేజ్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు , మీడియా రిలేషన్ ఆఫీసర్ సత్య గౌడ్, స్వచ్ఛంద రక్తదాతల ఆర్గనైజేర్స్ ,హెల్పినీడ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, మనోహర్ బాబు, శ్రీ శివ రామ కృష్ణ, ప్రకాష్, తలసీమియా గ్రూప్

## హరీశ్‌రావు వాదనలు నిరాధారం..
## తప్పుదారి పట్టించేలా ఉన్నాయి

**: మంత్రి ఉత్తమ్**



హైదరాబాద్: ఏపీ ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన గోదావరిబనకచర్ల ప్రాజెక్టు విషయంలో తెలంగాణ ప్రభుత్వంపై మాజీ మంత్రి హరీశ్‌రావు చేసిన ఆరోపణలను మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తోసిపుచ్చారు. ''గోదావరి బనకచర్ల ప్రాజెక్టుపై నిర్ణయాత్మకంగా వ్యవహరిస్తున్నాం. జనవరి 22న కేంద్ర జలశక్తి, ఆర్థికశాఖ మంత్రులకు లేఖ రాశాను. ఆ ప్రాజెక్టుపై అభ్యంతరాలు తెలిపాను. బనకచర్ల ప్రాజెక్టుపై కాంగ్రెస్ పార్టీ మౌనం వహించలేదు. చట్టపరంగా ముందుకెళ్తున్నాం. హరీశ్‌రావు వాదనలు నిరాధారం, తప్పుదారి పట్టించేలా ఉన్నాయి. నదీ జలాల హక్కులపై తెలంగాణకు నష్టం చేసింది బీఆర్ఎస్సే. కృష్ణానది వాటాను కేవలం 299 టీఎంసీలకే పరిమితం చేశారు. బీఆర్ఎస్ హయాంలోనే ముచ్చుమర్రి, మాల్యాల నుంచి నీటిని తరలించారు. రాయలసీమ ఎత్తిపోతలపై అపెక్స్ కౌన్సిల్‌ను మీరెందుకు సంప్రదించలేదు. ఏపీ.. రోజూ 3 టీఎంసీలు మళ్లిస్తోంటే కేసీఆర్ చోద్యం చూశారు. జగన్, కేసీఆర్ మధ్య అవగాహనతోనే తెలంగాణ నీటిని ఏపీకి దోచిపెట్టారు'' అని ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆరోపించారు.

## ప్రణీత్ రావు విచారణ ఆధారంగా ప్రభాకర్ రావుకు సిట్ ప్రశ్నలు

తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్‌ట్యాపింగ్ కేసులో సిట్ దూకుడు పెంచింది. ఈ కేసు వ్యవహారంలో ప్రధాన నిందితుడు , ఎస్‌బీఐ మాజీ చీఫ్‌ప్రభాకర్ రావు మూడో సారి సిట్ విచారణకు హాజరయ్యారు. తొలుత శనివారం హైదరాబాద్ జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ లోని సిట్ కార్యాలయానికి వచ్చారు. ప్రత్యేక అధికారుల బృందం సిట్ అధికారులు ఎలాంటి ప్రశ్నలు వేస్తారనే దానిపై ఉత్కంఠ రేపుతోంది. మొన్న శుక్రవారం రోజు మాజీ డీఎస్పీ ప్రణీత్ రావుపై విచారణ అధికారులు ప్రశ్నల వర్షం కురిపించిన విషయం తెలిసిందే. ప్రభాకర్‌రావు ఆదేశాలతోనే హార్డ్‌డిస్క్



ధ్వంసం చేశామని ప్రణీత్‌రావు ఈ మేరకు అధికారులకు చెప్పినట్లు సమాచారం. ఆయన స్టేట్‌మెంట్ ఆధారంగా ప్రభాకర్ రావును అధికారులు విచారిస్తున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా గత ప్రభుత్వంలో ఎస్ఐబీ చీఫ్‌గా పనిచేసిన సమయంలోనే ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడినట్లు ఆయనపై ఆరోపణలు వచ్చాయి. ప్రభాకర్ రావు విచారణతో ఈ కేసులో మరిన్ని కీలక విషయాలు వెలుగులోకి వస్తాయని సిట్ బృందం భావిస్తోంది. గత ప్రభుత్వంలో ఎవరు చెబితే ఫోన్ ట్యాపింగ్ జరిగిందనే అంశంపై, అలాగే ఎంతమంది రాజకీయ, సినీ ప్రముఖులు, న్యాయమూర్తులు, జర్నలిస్టుల ఫోన్లు ట్యాప్ చేశారనే కోణంలో సిట్ అధికారులు దర్యాప్తు చేయనున్నారు. గత ఎన్నికల్లో ప్రతిపక్షాలకు ఆర్థిక సహాయం చేసిన వారి ఫోన్‌లను కూడా ట్యాప్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.

## మంత్రిని అయ్యేందుకు సపోర్టు వాళ్లదే: వాకిటి శ్రీహరి



''నేను.. మంత్రిని అయ్యేందుకు సపోర్టు వాళ్లదే.. అని మహబూబ్ నగర్ ఎమ్మెల్యేలందరినీ ఉద్దేశించి'' మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. శనివారం గాంధీ భవన్‌లో పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌ను మంత్రి శ్రీహరి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పీసీసీ ఛీప్‌మంత్రి శ్రీహరిని శాలువాతో సత్కరించారు. అనంతరం మంత్రి శ్రీహరి మీడియాతో మాట్లాడుతూ.. నేను మంత్రిని కావడానికి వారంతా సపోర్ట్ చేశారన్నారు. నాకు ఇచ్చిన మంత్రి పదవిని బాధ్యతగా నిర్వహిస్తానని మంత్రి పేర్కొన్నారు. మంత్రిగా అవకాశం కల్పించిన అగ్రనేతలు సోనియా, రాహుల్, మల్లిఖార్జున ఖర్గే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్‌కు జీవితాంతం రుణపడి ఉంటానన్నారు. నేను చచ్చే వరకు ప్రజల్లో ఉండి, ప్రజలకు సేవ చేస్తానని ఆయన పేర్కొన్నారు. మక్తల్ ప్రజలకు ఎప్పుడు రుణపడి ఉంటానని చెప్పారు. రాహుల్ గాంధీ ఆలోచన మేరకే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలో కులగణన చేశారన్నారు. రాజకీయాల్లో సుదీర్ఘ అనుభవం ఉన్న వ్యక్తి పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ అన్నారు. మహబూబ్ నగర్ ఎమ్మెల్యేలందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అలాగే, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ కుంభకోణానికి సంబంధించిన ఫైలును పరిశీలిస్తానని మంత్రి చెప్పారు.

## గద్దర్ ఫౌండేషన్‌కు రూ.3 కోట్ల నిధులు మంజూరు

హైదరాబాద్: ప్రజా యుద్ధనౌక గద్దర్ ఆలోచనలు, ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ఏర్పాటు చేసిన గద్దర్ ఫౌండేషన్ కు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు మంజూరు చేసింది. గద్దర్ జయంతి ఉత్సవాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం గద్దర్ ఫౌండేషన్‌కు రూ.3 కోట్లను మంజూరు చేసింది. ఈ మేరకు రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ తరపున ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణ ఉద్యమం, సాంస్కృతిక రంగంపై తనదైన ముద్ర వేసిన గద్దర్ సేవలకు గుర్తింపుగా ఆయన జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోంది. ఇక ముందు గద్దర్ జయంతి వేడుకల కార్యక్రమాల నిర్వహణలోనూ గద్దర్ ఫౌండేషన్‌కు భాగస్వామ్యం కల్పిస్తూ మరో ఉత్తర్వును ప్రభుత్వం జారీ చేసింది.

## ఇప్పటికైనా కళ్లు తెరవండి.. గోదావరి-బనకచర్లను అడ్డుకోండి

**: హరీశ్‌రావు**

హైదరాబాద్: కృష్ణా జలాలను అక్రమంగా తరలించడానికి పోతిరెడ్డిపాడు ఎలా మారిందో.. గోదావరి జలాలను తరలించుకుపోవడానికి బనకచర్ల అలా ఉపయోగపడుతుందని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. గోదావరి బనకచర్ల లింక్ ప్రాజెక్ట్‌పై హరీశ్‌రావు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. బనకచర్ల ప్రాజెక్టు విషయంలో ఏపీ ప్రభుత్వం ముందుకెళ్తుంటే తెలంగాణ సీఎం, నీటిపారుదలశాఖ మంత్రి ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ''బనకచర్ల ప్రాజెక్టు ఏపీ ప్రభుత్వం నిర్మిస్తుంటే.. మన ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు ఉంది. ఏపీ ప్రభుత్వం ఈ నెలాఖరుకు టెండర్లు పిలిచేందుకు సన్నద్ధమవుతుంటే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిద్రపోతోంది. ఇరిగేషన్ శాఖామంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఉత్తుత్తి మాటలు మాట్లాడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం పెట్టడానికి రావట్లేదు. కేటీఆర్, ప్రతిపక్ష నేతలపై ఎలా కేసులు పెట్టాలనే దానిపైనే ప్రభుత్వానికి ధ్యాస తప్ప.. రాష్ట్ర ప్రయోజనాలు కాపాడాలనే ఆలోచన ఈ ప్రభుత్వానికి లేదు. గత రెండు కేంద్ర బడ్జెట్లు చూస్తే ఆంధ్రప్రదేశ్‌కు నిధుల వరద.. తెలంగాణకు గుండు సున్నా. నిధులు ఆంధ్రాకే, నదులు ఆంధ్రాకే .. తెలంగాణకు సున్నా.. ఇదీ దిల్లీ పాలకుల వైఖరి. నిధుల్లో, నదుల్లో తెలంగాణకు అన్యాయం జరిగినా ఈ రాష్ట్రంలో ఉన్న 8 మంది కాంగ్రెస్ ఎంపీలు, 8 మంది భాజపా ఎంపీలు నోరు విప్పడం లేదు. రాష్ట్రానికి చెందిన ఇద్దరు కేంద్ర మంత్రుల నుంచి ఎలాంటి స్పందన లేదు. గోదావరిబనకచర్లకు కేంద్రంలోని భాజపా ప్రభుత్వం నిధులు ఇచ్చి సహకరిస్తోంది. తెలంగాణ భవిష్యత్తును ప్రశ్నార్థకం



చేసే హక్కు మీకు ఎవరు ఇచ్చారు. 2 టీఎంసీల బాబ్లీ నీటి కోసం చంద్రబాబు 2008లో పెద్ద పోరాటం చేశారు. 200 టీఎంసీలతో అక్రమ ప్రాజెక్టు కడుతుంటే తెలంగాణ ప్రభుత్వం ఎంత పోరాటం చేయాలి. రాజకీయాల కంటే రాష్ట్ర భవిష్యత్తే భారాసకు ముఖ్యం. ఇప్పటికైనా కళ్లు తెరవండి. ఇంకా ఎక్కువ నష్టం జరగక ముందే గోదావరిబనకచర్లను అడ్డుకోండి. కాంగ్రెస్ ప్రభుత్వం చేసే ఏ పోరాటానికైనా మేం మద్దతిస్తాం. మీరు ముందుకు రాకపోతే భారాస పెద్ద ఎత్తున పోరాటం చేస్తుంది'' అని హరీశ్‌రావు తెలిపారు.

## కాళేశ్వరం కమిషన్ ఎదుట కాకమ్మ కథలు చెప్పారు: ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్



హైదరాబాద్: జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఎదుట విచారణకు ఇటీవల హాజరైన వ్యక్తులు.. క్యాబినెట్ నిర్ణయం మేరకే అంతా జరిగిందని చెప్పారని భాజపా నేత ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ అన్నారు. తప్పించుకోవడానికే ఇలా కాకమ్మ కథలు చెప్పారని ఎద్దేవా చేశారు. కేసీఆర్ బహిరంగ విచారణ వద్దని అనడంలోనే అసలు ఉద్దేశం తెలుస్తోందన్నారు. బండారం బయటపడుతుందని అలా అడిగారని చెప్పారు. అప్పటి సీఎం కేసీఆర్ తప్పులు జరుగుతున్నా సరిచేయలేదని దుయ్యబట్టారు. ''కాళేశ్వరం బ్యారేజీలు కుంగిన మాట వాస్తవం కాదా? తమ్మిడిహట్టి నుంచి ప్రాజెక్ట్ లొకేషన్‌ను రాజకీయ కారణాలతోనే మార్చారు. అంచనాలు పెంచడంపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ సమాధానాలు రాబట్టాలి. గత ప్రభుత్వ అవినీతిని బయటపెట్టాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరుతున్నాం. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడం లేదు. షెడ్యూల్ వెంటనే విడుదల చేయాలి. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమి ఖాయం'' అని ఎన్వీఎస్ఎస్

## కాళేశ్వరం ప్రాజెక్టు పనికిరాదు.. దాన్ని పూర్తిగా రద్దు చేయాలి: కూనంనేని

హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు పనికిరాదని, దాన్ని పూర్తిగా రద్దు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. ప్రజాధనాన్ని ఇకపై కాళేశ్వరం కోసం ఖర్చు చేయొద్దన్నారు. ''కాళేశ్వరానికి అన్నీ నేనే అన్న కేసీఆర్ ఇప్పుడు సంబంధం లేదంటున్నారు. ఈ ప్రాజెక్టు నిర్మించాక ఒక్క ఎకరాకు అదనంగా నీరు ఇవ్వలేదు. ఎల్లంపల్లి ద్వారానే పంటకు నీళ్లు అందుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం మానవ హక్కులను ఉల్లంఘిస్తోంది. మావోయిస్టుల మృతదేహాలను చూసి కూడా కేంద్రం భయపడుతోంది. కేశవరావు మృతదేహాన్ని అప్పగించకపోవడం దారుణం'' అని కూనంనేని అన్నారు.

## మరోసారి ఏఐజీ ఆసుపత్రికి కేసీఆర్

హైదరాబాద్: మాజీ సీఎం, భారాస అధినేత కేసీఆర్ (KCR) శనివారం మరోసారి గచ్చిబౌలిలోని ఏఐజీ ఆసుపత్రికి వెళ్లారు. వైద్య పరీక్షల కోసం అక్కడికి చేరుకున్నారు. మరోవైపు సాధారణ ఆరోగ్య పరీక్షల్లో భాగంగా కేసీఆర్ శుక్రవారం కూడా ఏఐజీ ఆసుపత్రికి వెళ్లారు. మధ్యాహ్నం 2.30 గంటలకు ఆసుపత్రికి వచ్చిన ఆయన.. గంట పాటు అక్కడే ఉన్నారు. ఏఐజీ ఛైర్మన్, ప్రముఖ గ్యాస్ట్రో ఎంటరాలజీ వైద్యులు డాక్టర్ నాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో కేసీఆర్‌కు పలు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్యపరంగా ఎలాంటి ఇబ్బంది లేకపోయినా.. తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్యులు పలు సూచనలు చేసినట్లు తెలుస్తోంది.





# కళ తెచ్చే కమీలియాలు!

**ఇంటి ముంగిట పూల మొక్కల్ని పెంచడమంటే ఇష్టం లేనిది ఎవరికి? చక్కటి రంగుల్లో విరబూసే పూలతో ఆకట్టుకునే కమీలియాలు ఇందుకు అనుకూలం. మరి వీటిని మనమెలా పెంచుకోవాలో తెలుసుకుందామా!**

తూర్పు, దక్షిణాసియాకు చెందిన ఈ మొక్కలు సమశీతోష్ణ వాతావరణంలో చక్కగా పెరుగుతాయి. వీటిల్లో కమీలియా జపోనికా, కమీలియా ససాన్క్వా, కమీలియా రెటిక్యులాటా, కమీలియా విలియమ్సి... వంటి రకాలెన్నో ఉన్నాయి. జపాన్, చైనాల్లో అక్కడి సాహిత్యం, కళల్లో విరివిగా కనిపిస్తుంటాయి. ప్రేమ, స్వచ్ఛత, శాశ్వతత్వానికి వీటిని ప్రతీకగా భావిస్తారు. ఇవి సాధారణంగా 1.5 నుంచి 6 మీటర్ల ఎత్తు వరకూ పెరుగుతాయి. వీటి ఆకులు గుండ్రంగా, ముదురు ఆకుపచ్చ రంగులో మెరిసిపోతాయి. పూల విషయానికి వస్తే కొన్ని రకాలు గులాబీలను, మరికొన్ని పియోనీలను పోలి ఉంటాయి. ఎరుపు, గులాబీ, తెలుపుతోపాటు డబుల్ కలర్స్‌లోనూ ఇవి విచ్చుకుంటాయి. ఎలా పెంచాలంటే... తక్కువ మెయింటెనెన్స్‌తో దీర్ఘకాలం నిలిచే మొక్క ఇది. అయితే, పాక్షికంగా నీడ తగిలేలా, బలమైన ఈదురుగాలులు వీచకుండా అడ్డుకునే ప్రదేశాన్ని దీన్ని నాటడానికి ఎంచుకోవాలి. సారవంతమైన పొడిమట్టిని కుండీల్లో నింపుకోవాలి. ఆమ్లత కోసం నెలకోసారైనా మట్టిలో కాస్త స్ఫటిక నీరు చల్లాలి. కుండీల్లో నాటుకునేటప్పుడు కంపోస్ట్, పీట్ మాస్ వంటివి అందులో కలిపితే... పూలు బాగా వస్తాయి. ఇక, మొక్కలకు తేమ అవసరమైనా, నీరు నిలవకుండా చూసుకోవాలి. ఎన్‌పీకే ఉన్న సమగ్రఎరువుని నెలరోజులకోసారి అందించాలి. పూలు పూయడం అయిపోయాక ప్రూనింగ్ చేయాలి. అయితే, మరీ ఎక్కువగా కట్ చేస్తే తర్వాత సీజన్‌లో పూల ఉత్పత్తి తగ్గే అవకాశం ఉంది. ఈ మొక్కల్ని తెల్లదోమ, బూడిద తెగులు ఇబ్బందిపెట్టొచ్చు. వీటికి పరిష్కారంగా సబ్బు ద్రావణాన్ని ఉపయోగించండి. ఆకుమచ్చలు, ఫంగల్ సమస్యలు రాకుండా మొక్క చుట్టూ గాలి ప్రసరణ బాగా ఉండేలా చూసుకోవాలి.











# మీ పట్టుచీర భద్రమేనా?

**పట్టు దుస్తులంటే... అమ్మదో, పెళ్లికి కట్టుకున్నదో, మొదటిసారి కొనుక్కున్నదో... ఏదో ఒక ప్రత్యేకత ఉంటుంది. అందుకే, పండగ, ఫంక్షన్ ఏదైనా... పట్టుకే పట్టం కడతాం. మరి వేల రూపాయలు ఖర్చు చేసి కొన్న చీరల్ని జాగ్రత్తగా ఉంచుకోకపోతే కొన్నాళ్లకే అవి పాడైపోతాయి. అలాకాకుండా ఏళ్ల తరబడి వాటి మన్నిక, మెరుపు బాగుండాలంటే...**

* పట్టు చీరల్ని వీలైనంతవరకూ డ్రైక్లీనింగ్ చేయించడమే మంచిది. ఎప్పుడైనా ఇంట్లోనే ఉతకాలనుకుంటే చల్లటి నీటిలో మైల్డ్ షాంపూ, కుంకుడుకాయల రసం, సిల్క్ డిటర్జెంట్‌తో శుభ్రం చేయండి. ఎట్టి పరిస్థితిలోనూ బ్రష్ పెట్టొద్దు. అయితే, రంగు పోకుండా ఉండటానికి మొదటిసారి ఉతికేటప్పుడు నీళ్లల్లో కాస్త వినెగర్ లేదా ఉప్పుని కలపడం మరిచిపోవద్దు.
* చీరల్ని కట్టిన ప్రతిసారీ ఉతకొద్దు. గాలికి ఆరనిచ్చి జాగ్రత్తగా మడతబెట్టండి. మరో రెండు మూడు సార్లయినా ధరించాకే ఆ పని చేయండి. అయితే, నేరుగా ఎండ తగిలే చోట కాకుండా నీడలో, గాలి బాగా వచ్చే చోట ఆరేయండి.
* ముడతలు పడిన పట్టు దుస్తుల్ని తక్కువ ఉష్ణోగ్రతల్లో ఇస్త్రీ చేయాలి. చీర మీద నేరుగా ఐరన్‌బాక్స్ పెట్టకూడదు. పైన కాటన్ వస్త్రం పరిచి చేస్తే మేలు. ముఖ్యంగా జరీ, ఎంబ్రాయిడరీ ఉన్న చోట వేడి ఎక్కువైతే అవి కాలిపోవచ్చు.
* శుభ్రమైన పొడికాటన్ లేదా మస్లిన్ వస్త్రంలోనే సిల్క్ చీరలను భద్రపరచాలి. అలాకాకుండా నేరుగా బీరువాలో పెడితే కీటకాలు పాడు చేస్తాయి. ప్లాస్టిక్ కవర్లలో పెడితే తేమ ఏర్పడి చీర దెబ్బతినొచ్చు. అందుకే, మరో చిన్న క్లాత్‌లో లవంగాలను కానీ, నాఫ్తలీన్ గోళీలను కానీ ఉంచితే సరి. సిల్వర్ ఫిష్ వంటివి దరిచేరవు. అలాగని నెలల తరబడి చీరల్ని ఒకే మడతల్లో ఉంచొద్దు. చిరిగిపోయే ప్రమాదం ఉంది. తరచూ వాటిని మారుస్తూ ఉండాలి.
* ఒక్కోసారి అనుకోకుండా... పట్టు చీరలపై మరకలు పడుతుంటాయి. అవి ఏవైనా సరే పడిన వెంటనే చల్లటి నీళ్లతో శుభ్రం చేయాలి. మొండి మరకలైతే కచ్చితంగా డ్రైక్లీన్ చేయించాలి. వీటిని తొలగించడానికి ఎప్పుడూ వేడి నీళ్లను కానీ, కఠిన రసాయనాలను కానీ వాడకూడదు.
* ఎక్కువ సమయం పట్టు దుస్తులు ధరించినప్పుడు వాటిపై చెమట మరకలు పడుతుంటాయి. అలాకుండా స్వెట్ ప్యాడ్స్ వాడండి. అలానే పరిమళద్రవ్యాలను నేరుగా వీటిపై స్ప్రే చేయకూడదు.



## బ్యాంకుల్లో గోల్డ్ లోన్ తీసుకుంటున్నారా?



**న్యూఢిల్లీ:** మీకు గోల్డ్ లోన్ కావాలా? వెంటనే కావాలా? కుదువబెట్టిన బంగారం తక్కువ వడ్డీకి మరో చోట పెట్టాలనుకుంటున్నారా? వంటి ప్రకటనలు ఆకట్టుకుంటాయి. ప్రజల ఆర్థిక అవసరాల కోసం గోల్డ్ లోన్లు ల ఒక ఆకర్షణీయ ఎంపికగా కనిపిస్తాయి. అయితే, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లతాజాగా జారీ చేసిన నూతన నిబంధనలు గోల్డ్ లోన్ తీసుకునే వారికి కొత్త సవాళ్లను తెచ్చిపెట్టాయి. అవి ప్రజల పాలిట పిడుగులా మారాయి. గోల్డ్ లోన్ల చెల్లింపు కాలం, వడ్డీ రేట్లు, ఇతర షరతులు కఠినతరంగా మారాయి. ఒక్కో బ్యాంకులో ఈ నిబంధనలు వేర్వేరుగా అమలవుతున్నాయి. కానీ, రుణగ్రహీతలు ఇకపై జాగ్రత్తగా ఆలోచించాల్సిన సమయం ఆసన్నమైంది. వైద్య చికిత్స కోసం, పిల్లల చదువుల కోసం, వ్యాపారం నిమిత్తం, వ్యవసాయ అవసరాల కోసం తీసుకొనే రైతులు, మహిళలు, యువత ఇకపై జాగ్రతగా ఆలోచించాల్సిన పరిస్థితి ఏర్పడింది. తీసుకున్న అప్పు మొత్తం వడ్డీసహా ఏడాదిలోగా చెల్లించాలంటే యాడికెళ్లి తేవాలని బాధపడవద్దు.లముందే ఆర్థిక పరిస్థితులను అంచనా వేసుకొని గోల్డ్‌లోను కోసం ముందుకెళ్లాల్సి ఉన్నది. ఎందుకంటే.. ఆర్బీఐ 2025 డ్రాఫ్ట్ మార్గదర్శకాలు గోల్డ్ లోన్లపై కఠిన నియంత్రణలను తీసుకొచ్చింది. గతంలో గోల్డ్ లోన్ తీసుకుంటే ఏడాదికి ఏడాది రెన్యూవల్ చేసుకొనే సౌలభ్యం ఉండేది. కానీ, ఇప్పుడు దానికి తొలగించారు. 12 నెలలు గరిష్ఠ పరిమితి విధించారు. 12 నెలలు దాటితే కచ్చితంగా రుణంతోపాటు వడ్డీ మొత్తం చెల్లించాల్సిందే. మళ్లీ రుణంగా కూడా అదే రోజు ఇవ్వరు. రుణం చెల్లించిన తర్వాత మరుసటి రోజు తిరిగి ఆ బంగారం ద్వారా రుణం నిబంధన పెట్టారు.

### నిబంధనల్లో కీలక అంశాలు

లోన్-టు-వాల్యూ నిష్పత్తి ప్రకారం బంగారం విలువలో 75 శాతం వరకు మాత్రమే రుణం పొందవచ్చు. రుణ మొత్తాన్ని వడ్డీతోసహా గరిష్ఠంగా 12 నెలల్లోగా చెల్లించాలి. ఈఎంఐ ఆధారిత రుణాలకు 36 నెలలు వరకు గడువు ఉన్నది. రుణం పునరుద్ధరించాలంటే కూడా కొన్ని షరతులు విధించింది. రుణం స్టాండర్డ్ స్థితిలో ఉండాలి. మొత్తం వడ్డీ చెల్లించబడి, కొత్త క్రెడిట్ అంచనా ఉండాలి. బంగారం విలువ నిర్ధారణ, వేలం ప్రక్రియలో పూర్తి పారదర్శకత తప్పనిసరిగా ఉండాలి. రుణ చెల్లింపు విఫలమైతే, బంగారం వేలం వేస్తారు. ఈ మేరకు రుణగ్రహీతకు సమాచారం ఇస్తారు. ఈ నిబంధనలు రుణగ్రహీతల రక్షణ, పారదర్శకతను పెంచడానికి ఉద్దేశించినవైనప్పటికీ, చెల్లింపు కాలం తగ్గడం, కఠిన షరతులు ప్రజలకు ఆర్థిక ఒత్తిడిని తెచ్చిపెట్టే ప్రమాదం ఉన్నది.

## ఆయుర్వేద, స్వదేశీ విజయసూత్రాలు

**భారత ఆరోగ్య రంగంలో పతంజలి ఫుడ్స్ విప్లవం**



**హైదరాబాద్, జూన్ 14 :న్యూఢిల్లీ:**

పతంజలి ఫుడ్స్ విప్లవం భారతదేశ ఆహార, ఆరోగ్య మార్కెట్‌ను విప్లవాత్మకంగా మారుస్తున్నామని పతంజలి ఫుడ్స్ ప్రకటించింది. పతంజలి తన స్వదేశీ , ఆయుర్వేద విధానంతో, వినియోగదారుల విశ్వాసాన్ని గెలుచుకోవడమే కాకుండా పెద్ద బహుళజాతి కంపెనీలకు గట్టి పోటీని ఇస్తోందని పేర్కొంది.

### స్వదేశీ, ఆయుర్వేద పద్ధతులతో పతంజలి ఉత్పత్తులు

"పతంజలి విజయానికి మొదటి కారణం దాని స్వదేశీ విధానం. కంపెనీ తన ఉత్పత్తులలో తేనె, నెయ్యి, చ్యవన్‌ప్రాష్ ,సుగంధ ద్రవ్యాలు వంటి సహజ , ఆయుర్వేద పదార్థాలను ఉ పయోగిస్తుంది. ఈ ఉత్పత్తులు ఆరోగ్యకరమైనవి మాత్రమే కాకుండా సరసమైనవి కూడా. ఇవి సామాన్య ప్రజలకు సులభంగా అందుబాటులో ఉంటాయి. అదనంగా, కంపెనీ సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తుంది, ఇది రైతులకు ప్రయోజనం చేకూరుస్తుంది మరియు పర్యావరణాన్ని రక్షిస్తుంది." అని పతంజలి సంస్థ ప్రకటించింది.

### ప్రజలు ఆరోగ్య స్పృహతో మారుతున్నారు: పతంజలి

రెండవది, పతంజలి వైవిధ్యంపై దృష్టి సారించింది. కంపెనీ తినదగిన నూనెలు, బిస్కెట్లు, నూడుల్స్, సౌందర్య సాధనాలు , న్యూట్రాస్యూటికల్స్ వంటి అనేక రంగాలలో ఉత్పత్తులను మార్కెట్‌లోకి అందిస్తోంది. పతంజలి న్యూట్రెలా స్పోర్ట్స్ డ్రింక్ , ప్రీమియం డ్రై ఫ్రూట్స్ వంటి కొత్త ఉత్పత్తులను ప్రారంభించింది, ఇవి యువత , ఆరోగ్య స్పృహ ఉన్న వ్యక్తులను ఆకర్షిస్తున్నాయి.

### ప్రత్యేకమైె మార్కెటింగ్ వ్యూహం

మూడవదిగా, కంపెనీ మార్కెటింగ్ వ్యూహం కూడా ప్రత్యేకమైనదని చెప్పుకోవచ్చు. పతంజలి తన ఉత్పత్తులను ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ఛానెల్‌ల ద్వారా దేశంలోని ప్రతి మూలకు చేరుస్తోంది. 40,000 మంది పంపిణీదారులు , 10,000 దుకాణాలు వినియోగదారులకు ఉత్పత్తులను సులభంగా అందుబాటులో ఉంచుతాయి. అలాగే, కంపెనీ ప్రకటనలు దేశీయ దృష్టి, వినియోగదారుల ఆరోగ్యంపై దృష్టి పెడతాయి, ఇది వినియోగదారులలో నమ్మకాన్ని పెంచుతుంది.

### స్వదేశీ, ఆరోగ్యం , స్వావలంబనను ప్రోత్సహించడం: పతంజలి

"ఇది కేవలం ఒక కంపెనీ కాదు, స్వదేశీ, ఆరోగ్యం మరియు స్వావలంబనను ప్రోత్సహించే ఉద్యమం. దాని ప్రయత్నాలతో, భారతదేశ ఆహారం మరియు ఆరోగ్య మార్కెట్ కొత్త శిఖరాలను తాకుతోంది." అని పతంజలి ఫుడ్స్ ప్రకటించింది.

# ఆస్ట్రేలియా గోడను బద్ధలు కొడుతూ..
# తొలిసారి ఐసీసీ ట్రోఫీ విజేతగా
# అవతరించిన దక్షిణాఫ్రికా..!

**లార్డ్స్:** అంతర్జాతీయ క్రికెట్‌లో కొత్త అధ్యాయం మొదలైంది. 27 ఏళ్లుగా కళ్లలో వొత్తులు వేసుకొని ఐసీసీ ట్రోఫీ కోసం ఎదురుచూస్తున్న దక్షిణాఫ్రికా కల ఎట్టకేలకు సాకారం అయింది. ఆస్ట్రేలియా గోడను బద్ధలు కొడుతూ ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ 2023-25) ఫైనల్లో సఫారీ జట్టు విజేతగా అవతరించింది. లార్డ్స్ మైదానంలో వేలాది ప్రేక్షకుల సమక్షంలో టెస్టు గద ను మురిపెంగా గుండెలకు హత్తుకుంది.ఆసీస్ నిర్దేశించిన 282 పరుగుల లక్ష్య ఛేదనలో ఎడెన్ మర్క్‌రమ్(136) చిరస్మరణీయ సెంచరీతో కదం తొక్కాడు. కెప్టెన్ తెంబ బవుమా(66) అద్భుత బ్యాటింగ్‌తో అలరించగా.. డేవిడ్ బెడింగమ్(21 నాటౌట్)జతగా మర్క్‌రమ్ జట్టును గెలుపు వాకిట నిలిపాడు. అయితే.. విజయానికి 6 పరుగులకు ముందు అతడు ఔటైనా.. కైలీ వెర్రిన్నే(7 నాటౌట్), బెడింగమ్ లాంఛనం పూర్తి చేయగా.. 5 వికెట్ల తేడాతో సఫారీ టీమ్ గెలుపొందింది. అంతే.. డబ్ల్యూటీసీలో కొత్త ఛాంపియన్ ఆవిర్భవించింది. తొలి రెండు సీజన్లలో న్యూజిలాండ్, ఆస్ట్రేలియా విజేతగా నిలవగా.. ఈసారి తమ వంతు అని సఫారీ జట్టు టెస్టు గదను తన్నుకుపోయింది.

### మర్క్‌రమ్ అద్భుత సెంచరీ

ఐసీసీ ట్రోఫీని ముద్దాడాలనే దక్షిణాఫ్రికా కల నిజమైంది. లార్డ్స్‌లో తొలి రోజు నుంచి రసవత్తరంగా సాగుతూ.. ఆధిపత్యం చేతులు మారిన్న డబ్ల్యూటీసీ ఫైనల్లో ఆ జట్టు జయకేతనం ఎగురవేసింది. ఏళ్లుగా తమను ఊరిస్తున్న ఐసీసీ టైటిల్‌ను ట్రోఫీని ఒడిసిపట్టింది. కగిసో రబడ(4-59), లుంగి ఎంగిడి(3-38)ల విజృంభణతో రెండో ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియాను 207కే ఆలౌట్ చేసిన సఫారీ జట్టు.. 282 పరుగుల ఛేదనలో అదరగొట్టింది. ఓపెనర్ ఎడెన్ మర్క్‌రమ్ (136) చిరస్మరణీయ సెంచరీతో కదం తొక్కగా.. చీలమండ గాయంతో బాధపడుతూనే సారథి తెంబ బవుమా(66) ఖతర్నాక్ ఇన్నింగ్స్ ఆడాడు.మూడో రోజు టీ సెషన్ తర్వాత ఆసీస్ బౌలర్లను విసిగిస్తూ స్కోర్ బోర్డును పరుగులు పెట్టించారిద్దరూ. చకచకా సింగిల్స్, డబుల్స్ తీస్తూ లక్ష్యాన్ని కరిగించిందీ జోడీ. మరికాసేపట్లో మూడో రోజు ఆట ముగుస్తుందనగా హేజిల్‌వుడ్ ఓవర్లో బౌండరీతో మర్క్‌రమ్ శతకం సాధించాడు. దాంతో, 214 పరుగులతో రోజును ముగించింది సఫారీ జట్టు. నాలుగో రోజు విజయానికి 69 పరుగులు అవసరం కాగా.. తొలి సెషన్‌లో మ్యాచ్ ముగించాలనుకున్నారు మర్క్‌రమ్, బవుమా.









6 పరుగుల దూరంలో..

కానీ.. రెండో రోజు 6 వికెట్లతో నిప్పులు చెరిగిన కమిన్స్.. తన రెండో ఓవర్లోనే బవుమాను ఔట్ చేసి దక్షిణాఫ్రికాకు షాకిచ్చాడు. ఆ కాసేపటికే ట్రిస్టన్ స్టబ్స్(8)ను స్టార్క్ బౌల్డ్ చేసినా మర్క్‌రమ్, డేవిడ్ బెడింగమ్ (21 నాటౌట్) ద్వయం కంగారూ పడలేదు. హేజిల్‌వుడ్ ఓవర్లో మిడ్‌వికెట్ దిశగా మర్క్‌రమ్ రెండు ఫోర్లు బాదాడు. అయితే.. చరిత్రాత్మక విజయానికి 6 పరుగులు అవసరం కాగా హేజిల్‌వుడ్ ఓవర్లో పెద్ద షాట్ ఆడబోయిన మర్క్‌రమ్.. హెడ్ చేతికి చిక్కాడు. ఆ తర్వాత కైలీ వెర్రిన్నే(7 నాటౌట్) స్టార్క్ బౌలింగ్‌లో బౌండరీ బాదగా .. బవుమా బృందం 5 వికెట్ల తేడాతో విజయం సాధించి ఛాంపియన్ ట్యాగ్ సొంతం చేసుకుంది.

## అహ్మదాబాద్ విమాన దుర్ఘటన



**అహ్మదాబాద్:** భారత్-ఇంగ్లండ్ టెస్టు సిరీస్ ట్రోఫీ ఆవిష్కరణ వాయిదాలార్డ్స్‌లో శనివారం జరగాల్సిన ఈ కార్యక్రమంవిమాన ప్రమాదంలో సుమారు 275 మంది మృతి చెందడంతో ఈ నిర్ణయంపటౌడీ ట్రోఫీ స్థానంలో ఈ నూతన ట్రోఫీని ప్రవేశపెట్టాలని నిర్ణయంకొత్త తేదీని త్వరలో ప్రకటించనున్న ఇరు బోర్డులు అహ్మదాబాద్: గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో గురువారం జరిగిన ఘోర విమాన ప్రమాదం కారణంగా, క్రికెట్ గ్గజాలు సచిన్ టెండూల్కర్, జేమ్స్ అండర్సన్ పేరిట నెలకొల్పిన ప్రతిష్ఠాత్మక 'టెండూల్కర్-అండర్సన్ ట్రోఫీ' ఆవిష్కరణ కార్యక్రమం వాయిదా పడిం. ఈ కార్యక్రమాన్ని వాస్తవానికి జూన్ 14 లండన్‌లోని చారిత్రాత్మక లార్డ్స్ మైదానంలో నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. భారత్, ఇంగ్లండ్ మధ్య ఐదు టెస్టుల సిరీస్ ఈ నెల 20న ప్రారంభం కానుంది. ఈ ఓపెనింగ్ సెర్మనీతో టెస్టు సిరీస్‌కు ఘనంగా శ్రీకారం చుట్టాలని భావించారు. అయితే, భారత్ లో విమాన ప్రమాదం తీవ్ర విషాదం కలిగించడంతో ప్రారంభోత్సవం వాయిదా వేయాలని ఇరు దేశాల క్రికెట్ బోర్డులు నిర్ణయించాయి.ఇదివరకూ భారత్, ఇంగ్లండ్ జట్ల మధ్య జరిగే టెస్ట్ సిరీస్ విజేతలకు 'పటౌడీ ట్రోఫీ'ని అందజేసేవారు. అయితే, ఇటీవలే ఆ ట్రోఫీ పేరును మార్పు చేస్తూ, క్రికెట్ చరిత్రలో తమదైన ముద్ర వేసిన సచిన్ టెండూల్కర్, జేమ్స్ అండర్సన్‌ల గౌరవార్థం వారి పేర్లతో కొత్త ట్రోఫీని ప్రవేశపెట్టాలని నిర్ణయించారు.ప్రస్తుతం వాయిదా పడిన ఈ కార్యక్రమాన్ని తిరిగి ఎప్పుడు నిర్వహించేది అనే దానిపై బీసీసీఐ, ఈసీబీ అధికారులు ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. త్వరలోనే కొత్త తేదీని ఖరారు చేసి, వెల్లడించే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ విషయమై ఇరు బోర్డుల మధ్య చర్చలు జరుగుతున్నట్లు సమాచారం.

## రెండు విడతలుగా రంజీ ట్రోఫీ..
## షెడ్యూల్ వెల్లడించిన బీసీసీఐ



**న్యూఢిల్లీ:** దేశవాళీ క్రికెట్ కొత్త సీజన్‌కు భారత క్రికెట్ బోర్డు షెడ్యూల్ విడుదల చేసింది. శనివారం జరిగిన సమావేశంలో బీసీసీఐ పెద్దలు దేశవాళీ సీజన్ షెడ్యూల్ ఖరారు చేశారు. విరామం లేకుండా మ్యాచ్‌ల నిర్వహణపై క్రికెటర్లు ఫిర్యాదు నేపథ్యంలో కీలక నిర్ణయం తీసుకుంది. లీగ్‌ను రెండు దశలుగా నిర్వహించాలని బీసీసీఐ తీర్మానించింది. అక్టోబర్ 15 నుంచి ఫిబ్రవరి 28 మధ్యలో రంజీ ట్రోఫీ నిర్వహిస్తామని భారత బోర్డు తెలిపింది.

దులీప్ ట్రోఫీతో దేశవాళీ సీజన్ 2025-26 ప్రారంభం కానుంది. ఆగస్టు 28 ను మొదలయ్యే ఈ టోర్నీ సెప్టెంబర్ 15న ముగుస్తుంది. ఆ తర్వాత ఇరానీ కప్ అక్టోబర్ 1 నుంచి 5వ తేదీ వరకూ జరగనుంది. ఇందులోరంజీ విజేత డిఫెండింగ్ ఛాంపియన్ రెస్ట్ ఆఫ్ ఇండియా ట్రోఫీ కోసం పోటీ పడనుంది.

తదనంతరం రంజీ ట్రోఫీ షురూ అవుతుంది. అంతేకాదు ఈసారి రంజీ ట్రోఫీ సరికొత్తగా ఉండనుంది. జూనియర్, సీనియర్ విభాగాల్లో ఒక జట్టు ప్రమోట్ అవుతుంది. మరొక జట్టు 206-27 సీజన్‌కు అర్హత సాధిస్తుంది. ఫిబ్రవరి 6 నుంచి 28 వరకూ నాకౌట్ మ్యాచ్‌లు ఉంటాయి.

# ఆఖరి నిమిషంలో తడబాటు

### టీమిండియాకు ఊహించని ఓటమి..!

**న్యూఢిల్లీ:** యూరప్ గడ్డపై భారత జట్టుకు మరో ఓటమి. ఇప్పటికే హాకీ ప్రో లీగ్‌లో నాలుగు పరాజయాలు మూటగట్టుకున్న టీమిండియా శనివారం ఆస్ట్రేలియా చేతిలో కంగుతిన్నది. తొలిఅర్ధ భాగంలో 2 గోల్స్‌తో ఆధిక్యంలో ఉన్న భారత్.. ఆఖర్లో పట్టు సడలించింది. ప్రత్యర్థి ఆటగాళ్లు పెనాల్టీ కార్నర్లను సద్వినియోగం చేసుకున్నారు. దాంతో, ఫార్వర్డ్ ప్లేయర్ అభిషేక్ రెండు గోల్స్‌తో మెరిసినప్పటికీ కంగారూల చేతిలో 2-3తో మ్యాచ్ చేజారింది.

హాకీ ప్రో లీగ్‌లో భారత జట్టును వరుస ఓటములు వెంటాడుతున్నాయి. నెదర్లాండ్స్ చేతిలో రెండుసార్లు, అర్జెంటీనాతో ఒక మ్యాచ్‌లో పరాజయం పాలైన టీమిండియా శనివారం కూడా విజయాన్ని అందుకోలేకపోయింది. తొలి అర్ధ భాగంలోనే ఫార్వర్డ్ అభిషేక్ 8వ నిమిషంలో, 35వ నిమిషంలో గోల్ చేయడంతో భారత్ 2-0తో ఆధిక్యంలోకి వెళ్లింది. దాంతో, విజయం కాయం అనిపించింది.



# కుబేర మూవీ టీజర్ విడుదలకు రంగం సిద్ధం

## హైదరాబాద్ వేదికగా నేడు గ్రాండ్ ఈవెంట్




**టాకీస్:** శేఖర్ కమ్ముల దర్శకత్వంలో తమిళ నటుడు ధనుష్, టాలీవుడ్ నటుడు నాగార్జున, రష్మిక మందన్నా ప్రధాన పాత్రల్లో నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం కుబేర టీజర్ విడుదలకు రంగం సిద్ధం అయ్యింది. హైదరాబాద్ వేదికగా ఆదవారం ఈవెంట్‌ను గ్రాండ్‌గా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. వచ్చే వారం రిలీజ్ కాబోతున్న కుబేర సినిమాపై ఆడియెన్స్‌లో ఉన్న ఎక్స్‌పెక్టేషన్స్ అన్నీ ఇన్నీ కావు. ఎప్పుడెప్పుడు సినిమా రిలీజవుతుందా అని ఉత్కంఠగా వేయిట్ చేస్తున్నారు.పాన్ ఇండియా లెవల్లో తెరకెక్కుతున్న ఈ సినిమాను శ్రీ వెంకటేశ్వర సినిమాస్ , అమిగోస్ క్రియేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ బ్యానర్లపై సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ రావు నిర్మిస్తుండగా. ఈ జూన్ 20న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సినిమా ప్రీ రిలీజ్ వేడుకను వాయిదా వేసిన విషయం తెలిసిందే. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో విమాన ప్రమాదం జరగడంతో ఈ వేడుకను వాయిదా వేసుకున్నారు. తాజాగా ఈ వేడుకకి సంబంధించి కొత్త డేట్‌ని ప్రకటించారు. కుబేరా ప్రీ రిలీజ్ వేడుకను జూన్ 15న హైదరాబాద్‌లో గ్రాండ్‌గా నిర్వహించ బోతున్నట్లు తెలిపారు. అలాగే ఈ మూవీ నుంచి రేపు -ట్రైలర్‌ను విడుదల చేయనున్నట్లు- చిత్రయూనిట్ ప్రకటించింది. ఈ కార్యక్రమానికి చిత్రబృందంతో పాటు పలువురు సినీ ప్రముఖులు హాజరయ్యే అవకాశం ఉంది. ట్రైలర్ లాంచ్‌తో సినిమాపై మరింత హైప్ పెరిగేలా ప్లాన్ చేస్తున్నారు మేకర్స్.

# కన్నప్ప ట్రైలర్ విడుదల

## ప్రభాస్, విష్ణు అదరగొట్టేశారుగా..!

**టాకీస్:** మంచు ఫ్యామిలీ ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న కన్నప్ప చిత్రం జూన్ 27న విడుదల కానుండగా, ఈ సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి. కలెక్షన్ కింగ్ మంచు మోహన్ బాబు నిర్మిస్తున్న ఈ భారీ ప్రాజెక్ట్‌లో మంచు విష్ణు కథానాయకుడిగా నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ చారిత్రక చిత్రానికి మహాభారతం సీరియల్ ఫేమ్ ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాలో ప్రభాస్ తో పాటు బాలీవుడ్, కోలీవుడ్ అగ్రతారలు కూడా నటిస్తున్న విషయం తెలిసిందే. ఆకట్టుకుంటుంది. విజువల్స్, బ్యాగ్రౌండ్ మ్యూజిక్ మరింత హైప్ క్రియేట్ చేశాయి. ఇక ప్రభాస్ స్క్రీన్ ప్రెజెన్స్ గురించి చెప్పక్కర్లేదు. ఇప్పటి వరకు విడుదలైన పోస్టర్స్ కంటే ట్రైలర్ తోనే మరింత అంచనాలు పెంచేశారు మేకర్స్.

శివ భక్తుడైన కన్నప్ప జీవిత గాథ ఆధారంగా ఈ సినిమాను అత్యంత భారీ బడ్జెట్‌తో, ఉన్నత సాంకేతిక విలువలతో తీర్చిదిద్దుతున్నారు. పాన్ ఇండియా స్టార్ ప్రభాస్‌తో పాటు, బాలీవుడ్, కోలీవుడ్‌కు చెందిన పలువురు అగ్రశ్రేణి నటీనటులు ఈ సినిమాలో




భారీ బడ్జెట్‌తో రాబోతున్న ఈ సినిమా ట్రైలర్‌ను తాజాగా విడుదల చేశారు.తిన్నడుగా విష్ణు, రుద్ర పాత్రలో ప్రభాస్, శివుడిగా అక్షయ్ కుమార్ నటించారు. ట్రైలర్ ఎంతగానో ఆకట్టుకుంది. ఈ ట్రైలర్ మూవీపై అంచనాలు పెంచింది. అయితే గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జరిగిన విమాన ప్రమాదం వలన ఈ వేడుకను వాయిదా వేశారు. అయితే తాజాగా ట్రైలర్‌ను చిత్రబృందం తాజాగా ప్రకటించింది. ఈ ట్రైలర్ కీలక పాత్రలు పోషిస్తుండటంతో సినిమాపై అంచనాలు భారీగా నెలకొన్నాయి.సినిమా విడుదలకు ముందే, ట్రైలర్ ద్వారా సినిమాలోని కీలక ఘట్టాలను, విజువల్ గ్రాండియర్‌ను ప్రేక్షకులకు పరిచయం చేశారు. భక్తి, త్యాగం ప్రధాన అంశాలుగా సాగే ఈ పౌరాణిక కావ్యం, ప్రేక్షకులకు ఒక సరికొత్త సినిమాటిక్ అనుభూతిని అందిస్తుందని చిత్ర బృందం ధీమా వ్యక్తం చేస్తోంది.

# సక్సెస్‌కు కొత్త భాష్యం చెప్పిన నటి సమంత

## విజయం అంటే స్వేచ్ఛేనని స్పష్టం చేసిన సమంత

## దాదాపు రెండేళ్లుగా వెండితెరకు దూరంగా ఉన్న సమంత

## ఇటీవల 'శుభం' సినిమాలో అతిథి పాత్రలో మెరిసిన వైనం

## 'మా ఇంటి బంగారం' చిత్రం ప్రకటన




టాకీస్: ప్రముఖ కథానాయిక సమంత తన దృష్టిలో విజయం అంటే స్వేచ్ఛను పొందడమేనని అన్నారు. గతంతో పోలిస్తే ప్రస్తుతం మరింత ఎక్కువ విజయాన్ని సొంతం చేసుకున్నట్టు భావిస్తున్నానని తెలిపారు. దాదాపు రెండేళ్ల విరామం అనంతరం సినిమాల్లో తన ప్రయాణం, వ్యక్తిగత ఎదుగుదల గురించి ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఆమె పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. విజయం గురించి తన అభిప్రాయాన్ని వివరిస్తూ "విజయానికి నిర్వచనం ఏమిటని అడిగితే నేను వెంటనే స్వేచ్ఛ అని చెబుతాను. నిరంతరం అభివృద్ధి చెందడం, పరిణితి సాధించడం, దేనికీ బందీగా ఉండకపోవడమే నా దృష్టిలో నిజమైన స్వేచ్ఛ. అదే అసలైన విజయం" అని సమంత పేర్కొన్నారు. గత రెండేళ్లుగా తన సినిమా ఏదీ విడుదల కాకపోయినా, ఈ విరామ సమయంలో తాను ఎంతో స్వేచ్ఛగా ఉన్నానని ఆమె తెలిపారు. "బహుశా నా చుట్టూ ఉన్నవారు, గతంతో పోలిస్తే నేనిప్పుడు విజయం సాధించలేదని అనుకోవచ్చు. కానీ, నా వ్యక్తిగత దృష్టిలో మాత్రం నేను గతం కంటే ఎక్కువ సక్సెస్‌ఫుల్‌గా ఉన్నాను. నేను ప్రస్తుతం చేస్తున్న పనులు నాకు ఎంతో ఉత్సాహాన్నిస్తున్నాయి. వాటిని పూర్తి చేయడం కోసం ప్రతిరోజూ ఎంతో ఆనందంగా నిద్రలేస్తున్నాను" అని సమంత వివరించారు. సినిమాల విషయానికొస్తే సమంత పూర్తిస్థాయి ప్రధాన పాత్రలో కనిపించి దాదాపు రెండేళ్లు కావొస్తోంది. ఇటీవల విడుదలైన 'శుభం' చిత్రంలో ఆమె మాతాజీ అనే ప్రత్యేక అతిథి పాత్రలో కనిపించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. అంతేకాకుండా, ఈ సినిమాతో సమంత తొలిసారిగా నిర్మాణ రంగంలోకి కూడా అడుగుపెట్టారు. ఇప్పుడు 'మా ఇంటి బంగారం' అనే చిత్రాన్ని నిర్మిస్తున్నట్టు ప్రకటించారు. ఈ సినిమా షూటింగ్ ఈ నెలలోనే ప్రారంభం కానుందని సమాచారం. త్వరలోనే మరిన్ని వరుస చిత్రాలతో ప్రేక్షకులను అలరిస్తానని సమంత ఇటీవల అభిమానులకు హామీ ఇచ్చారు.

# కెన్యా అడవుల్లో విధ్వంసం సృష్టించబోతున్న మహేష్ బాబు..

## లభించిన అనుమతులు



టాకీస్: సూపర్ స్టార్ మహేష్ బాబు, స్టార్ డైరెక్టర్ రాజమౌళి కాంబినేషన్‌లో క్రేజీ ప్రాజెక్ట్ రూపొందుతున్న విషయం తెలిసిందే. ఈ చిత్రం కోసం మహేష్ బాబు అభిమానులే కాదు సినీ ప్రియులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.ఎస్ఎస్ఎంబీ 29 ప్రారంభమైన నాటి నుంచి ఈ సినిమా కథేంటి? నటీనటులు ఎవరు ? టెక్నీషియన్స్ ఎవరు ? బడ్జెట్ ఎంత, షూటింగ్ లొకేషన్స్ ఏంటి అంటూ మహేశ్ అభిమానులు తెగ చర్చించుకుంటున్నారు. అయితే ఇప్పటికే రెండు షెడ్యూల్స్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం త్వరలో మూడో షెడ్యూల్ జరుపుకోనుంది. జూలై రెండో వారం నుంచి ఈ షెడ్యూల్ కెన్యాలో ప్రారంభంకానున్నట్లు సమాచారం. కెన్యా షెడ్యూల్‌లో రాజమౌళి భారీ యాక్షన్ ఎపిసోడ్స్, ఛేజ్ సీక్వెన్స్‌లు చిత్రీకరించనున్నట్టు టాక్ నడుస్తుంది. కెన్యాలోని అటవీ ప్రాంతంలో నెలరోజుల పాటు ఈ షెడ్యూల్ జరగనుందట.. ఈ షెడ్యూల్ కోసం రాజమౌళి, మహేష్ బాబు, ప్రియాంక చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ ఇతర చిత్ర యూనిట్ మొత్తం కెన్యాకు త్వరలో పయనం కానున్నారు. ఇప్పటికే కెన్యాలో చిత్ర షూటింగ్‌కి అనుమతి లభించినట్టు చెబుతున్నారు. కెన్యా లోని ప్రఖ్యాత అంబోసెలి నేషనల్ పార్క్ లో కూడా రాజమౌళి కొన్ని కీలక సన్నివేశాలని తెరకెక్కించనున్నారని అంటున్నారు.

# 'స్క్విడ్‌గేమ్ 3' ఫైనల్ ట్రైలర్ విడుదల..

## ఉత్కంఠగా చివరి సీజన్!

**టాకీస్:** ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నెట్‌ఫ్లిక్స్ వెబ్ సిరీస్ 'స్క్విడ్ గేమ్' చివరి సీజన్ మరో 13 రోజుల్లో నెట్‌ఫ్లిక్స్‌లో రాబోతున్న విషయం తెలిసిందే. ఎంతో మంది సినీ ప్రియులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ వెబ్ సిరీస్ చివరి సీజన్ జూన్ 27, 2025 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో తెలుగుతో పాటు తమిళం, హిందీ, ఇంగ్లీష్ భాషల్లో స్ట్రీమింగ్ కాబోతుంది. ఈ సందర్భంగా ఫైనల్ ట్రైలర్‌ను విడుదల చేశారు మేకర్స్. ఈ ట్రైలర్ చూస్తుంటే, కథానాయకుడు సియోంగ్ గి-హున్ (లీ జంగ్-జే) ఈ ప్రాణాంతక ఆటకు ఎలా ముగింపు పలుకుతాడు, అలాగే ఈ గేమ్ వెనుక ఉన్న ఫ్రంట్ మ్యాన్‌ను కనిపెట్టాడా లేదా అనే అంశాలు ఈ సీజన్‌లో ప్రధానంగా చూపించనున్నారని స్పష్టమవుతోంది.




మొదటి రెండు సీజన్‌లలో భారీ విజయాన్ని సాధించిన ఈ కొరియన్ థ్రిల్లర్ వెబ్ సిరీస్, తెలుగుతో పాటు అనేక భారతీయ భాషల్లోనూ అందుబాటులో ఉండనుంది. ఈ చివరి సీజన్ కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇక ఈ వెబ్ సిరీస్‌కు హ్వాంగ్ డాంగ్ హ్యుక్ దర్శకత్వం వహించారు.

# మెగాఫోన్ పడుతున్న రాహుల్ రామకృష్ణ..

## ప్రియదర్శి సెటైర్లు

**టాకీస్:** సైన్మా(షార్ట్ ఫిల్మ్), అర్జున్ రెడ్డి, జాతిరత్నాలు, ఓం భీమ్ బుష్, బ్రోచేవారేవురా, హుషారు చిత్రాలతో తనకంటూ నటుడిగా గుర్తింపు తెచ్చుకున్న నటుడు రాహుల్ రామకృష్ణ తొలిసారి మెగాఫోన్ పడుతున్నాడు. తాను ఒక సినిమా తీయబోతున్నట్లు ఈ సినిమాలో నటించేందుకు కేవలం 25 నుంచి 35 ఏండ్లు ఉన్న అమ్మాయిలు మాత్రమే కావాలని సోషల్ మీడియాలో ఒక పోస్ట్ పెట్టాడు. అయితే దీనికి సెటైరికల్‌గా స్పందించాడు నటుడు ప్రియదర్శి.



రాహుల్ పోస్ట్ కింద కామెంట్ పెడుతూ.. పురుష నటులు ఒద్దా సార్?.. ఫెమినిస్టిక్ సినిమా నా భయ్యా? షఠ రీల్స్ అంటే రీల్స్ కూడా సెండ్ చేయొచ్చా బ్రో.. ఎక్కువ వ్యూస్ లేవు ఆ వీడియోకి..? మీరు దర్శకుడు అంటే హీరో ఎవరు అన్నా? ఇది అవార్డ్స్ టైపు మూవీ అహ్ అండి? ఫ్యాన్స్ ప్రశ్నలు జల్దీ చెప్పు అంటూ ప్రియదర్శి కామెంట్ చేశాడు.

అయితే దీనికి రాహుల్ రామకృష్ణ బదులిస్తూ.. నువ్వు ఇన్ని ప్రశ్నలు నువ్వు చేసిన కొన్ని సినిమాలు చేయక ముందు అడిగి ఉండాల్సిందంటూ సెటైరికల్‌గా సమాధానమిచ్చాడు.

# బిందు మాధవికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన 'దండోరా' టీమ్

టాకీస్: టాలీవుడ్ కథానాయిక బిందు మాధవికి 'దండోరా' చిత్ర బృందం పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపింది. 'కలర్‌ఫోటో', 'బెదురులంక 2012' వంటి చిత్రాలతో సూపర్‌హిట్‌లు అందుకున్న లౌక్య ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై వస్తున్న తాజా చిత్రం 'దండోరా'. ఈ సినిమాను రవీంద్ర బెనర్జీ ముప్పనేని నిర్మిస్తుండగా.. మురళీకాంత్ దర్శకత్వం వహిస్తున్నారు. తెలంగాణ గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో బిందు మాధవి, శివాజీ, నవదీప్‌తో పాటు నందు, రవికృష్ణ, మనికా చిక్కాల, మౌనికా రెడ్డి, రాధ్య, సింగర్ అదితి భావరాజు తదితరులు ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ప్రస్తుతం శరవేగంగా ఈ సినిమా షూటింగ్ జరుపుకుంటుంది. అయితే ఈ సినిమాలో నటిస్తున్న కథానాయిక బిందు మాధవి పుట్టినరోజు నేడు. ఈ సందర్భంగా ఆమెకి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ.. మూవీ నుంచి కొత్త పోస్టర్‌ను పంచుకుంది.




ఇక ఈ చిత్రంలో బిందు మాధవి శ్రీలత అనే బలమైన పాత్రలో పోషిస్తున్నట్లు చిత్రయూనిట్ వెల్లడించింది. చాలా రోజుల తర్వాత తెలుగు సినిమాలో బిందు మాధవి నటిస్తుండటంతో ఈ సినిమాలో తన రోల్ ఎలా ఉండబోతుందని ప్రేక్షకులు ఆసక్తికరంగా ఎదురుచూస్తున్నారు.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.